



# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :91 22 ఆదివారం, ఫిబ్రవరి 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


## స్వావలంబనతోనే అభివృద్ధి సాధ్యం

### ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం): భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే స్వావలంబన సాధించడం అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దీనికోసం సెమీకండక్టర్ చిప్‌ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని తెలిపారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ కలిసి ఉత్తర్‌ప్రదేశ్‌లోని జేవర్‌లో ఏర్పాటు చేయనున్న సెమీకండక్టర్ పరిశ్రమకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. 'వికసిత భారతానికి 'మేడ్ ఇన్ ఇండియా' చిప్‌లు ఎంతో ముఖ్యం. కరోనా సమయంలో చిప్‌ల సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో.. అనేక ఆర్థిక వ్యవస్థల అభివృద్ధి నిలిచిపోయింది. వివిధ కర్మాగారాల్లో పనులు ఆగిపోయాయి.

సుప్రీం తీర్పుపై ట్రంప్

## తీవ్ర నిరాశ

- అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు
- సుంకాలు వెంటనే అమల్లోకి..
- సుప్రీం తీర్పు తర్వాత ట్రంప్ ప్రకటన
- వాణిజ్య దిగ్బంధం విధిస్తానని హెచ్చరిక



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం): ప్రపంచ దేశాలపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వచ్చేలా ఒక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. అయితే ఈ సుంకాలు ఫిబ్రవరి 24 నుంచి అమల్లోకి వస్తాయని వైట్?హౌస్ వెల్లడించింది. ఇవి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలిపింది.అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధించేందుకు ఓవల్ ఆఫీస్? నుంచి సంతకం చేయడం తనకు చాలా గౌరవంగా ఉందని ట్రూత్? పోస్ట్?లో పేర్కొన్నారు. ఇవి దాదాపు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు.



## రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని మన్నించిన సిసిఐ

కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలు వెంటనే స్పందించారు

పత్తి కొనుగోళ్లు ఈ నెలాఖరు వరకు కొనసాగుతాయి

పత్తి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావువెల్లడి



### లడ్డూ గురించి మాట్లాడితే హెరిటేజ్‌ను

## ముందుకు తెచ్చారు

- ఆయేషా మీరా హత్య కేసు ముగింపు
- మండలిలో ఫోటోలతో శ్రీవారికి అపచారం
- లడ్డూలో వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పింది
- తప్ప చేసిన ఎవ్వరినీ వదలబోనన్న సిఎం చంద్రబాబు

పల్నాడు,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం): చెప్పులు వేసుకుని వేంకటేశ్వరస్వామి ఫొటోలను మండలిలో వైకాపా సభ్యులు విసిరేశారని సిఎం చంద్రబాబు మండిపడ్డారు. శ్రీవారి విషయం బయట మాట్లాడకూడదని రెండు రోజులుగా ఆగానన్నారు. వేంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని.. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. ఏపీ శాసనమండలిలో వేంకటేశ్వర స్వామి ఫొటోలతో వైసీపీ సభ్యులు చేసిన నిరసనలపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ అంశంపై వినుకొండ సభలో సీఎం మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూను అపవిత్రం చేశారని చెబితే హెరిటేజ్‌ను తెరపైకి తీసుకొచ్చారన్నారు. 'నేను ప్రాణం పోయినా తప్పు చేయను' అని స్పష్టం చేశారు.

## పాక్‌లో ఆత్మాహుతి దాడి

### మొత్తం 16 మంది దుర్మరణం



లాహోర్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం): పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులో శనివారం ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు పాక్ సైనికులు, ఐదుగురు ఉగ్రవాదులు సహా మొత్తం 16 మంది మరణించారు. మృతులలో లెఫ్టినెంట్ కల్నల్ స్థాయి అధికారితో పాటు పౌరులూ ఉన్నట్టు సమాచారం. అనేక మంది సైనికులు గాయపడ్డారు. ఆ దేశంలో 15 రోజుల వ్యవధిలో ఇది మూడో ఆత్మాహుతి దాడి కాగా.. ఐదు రోజుల్లో రెండోది కావడం గమనార్హం. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని బన్ను జిల్లా సరార్ దర్గా ప్రాంతంలో ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో కూడిన ఓ వాహనాన్ని పాక్ భద్రతా దళాలు అడ్డుకున్నాయి. దీంతో ఆత్మాహుతి దళ సభ్యుడు సైనిక కాన్వాయ్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది.

### పేదల సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ

## ప్రధాన సంకల్పం

గ్రామీణ ప్రాంతాల్లో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు

కనీసం ఈ ఏడాదిలోనైనా 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి



హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం): తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014-23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### మహిళల ఆర్థిక సాధికారతే

## తెలంగాణ ప్రగతి

జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మంత్రి సీతక్క



హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం): మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క అన్నారు. వారిని ఆర్థికంగా స్థితిమంతులుగా చేయడానికి ఇందిరా మహిళా శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మహిళా సాధికారతలో తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతిని ఆవిష్కరించారు.



### డిసిసి అధ్యక్ష పదవి ఎదిగేందుకు

## తొలిమెట్టు

### కాంగ్రెస్‌లో కష్టపడితేనే పదవులు వరిస్తాయి

- అవకాశాలను అందిపుచ్చుకుని సాగాలి
- ఎవ్వరికైనా మెరిట్ లిస్ట్ ప్రకారమే అవకాశం
- భిన్నాభిప్రాయాలు పార్టీ కార్యకర్తల స్థయిర్యాన్ని దెబ్బతీస్తాయి
- డిసిసి అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

వికారాబాద్,ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం): భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు.రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.






### దేశం నుంచి చొరబాటుదార్లను

## తరిమేస్తాం

ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం

కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక

గౌహతి,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం): నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు.

## సుప్రీం తీర్పుపై ట్రంప్

# తీవ్ర నిరాశ

ఈ విషయంపై అందిరికి ధన్యవాదాలు అని రాసుకొచ్చారు. చట్టపరమైన మరో అధికారాన్ని అమలు చేసే వరకు ఈ కొత్త సుంకం అమల్లో ఉంటుందని వైట్? హౌస్ అధికారి ఒకరు పేర్కొన్నారు. వాణిజ్య భాగస్వాములు అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు ప్రకారం టారిఫ్?లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. భారత్ 10 శాతం టారిఫ్ చెల్లించాలా? అలాగే ఇది గతంలో ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకానమీక్ పవర్ యాక్ట్(ఐఈఈపీఏ) కింద విధించిన టారిఫ్?లను భర్తీ చేస్తారా అని ప్రశ్నకు వైట్?హౌస్ అధికారి ఈ మేరకు స్పందించారు. ఈ 10 శాతం గ్లోబల్ టారిఫ్? అనేది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన రక్షణాత్మక వాణిజ్య విధానంలో భాగమని పేర్కొన్నారు. చెల్లింపుల సమతుల్యత లోటును తగ్గించడం, అన్యాయ వాణిజ్య విధానాలను పరిష్కరించే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మరోవైపు రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్న చమురు కొనుగోళ్లను భారత్ తన అభ్యర్థన మేరకు గణనీయంగా తగ్గించిందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. భారత్?తో తనకు అద్భుతమైన సంబంధం ఉందని తెలిపారు. వైట్?హౌస్?లో అమెరికా సుప్రీంకోర్టు తను విధించిన టారిఫ్‌లను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక భారత్?తో ట్రేడ్? డీల్ కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. పరస్పర టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కొత్త చట్టపరమైన మార్గాల ద్వారా కొనసాగుతాయని సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా, సుంకాలతో భారత్?–పాక్? యుద్ధాన్ని పరిష్కరించినట్లు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. 'నేను పరిష్కరించిన 8 యుద్ధాల్లో 5 యుద్ధాలను టారిఫ్‌ల ద్వారా ముగించాను. మీకు నచ్చినా, నచ్చకపోయినా నేను 8 యుద్ధాలను ముగించాను. అందులో భారత్–పాకిస్థాన్ వంటి అణు యుద్ధానికి దారితీసే పెద్ద వివాదాలు కూడా ఉన్నాయి. గురువారం జరిగిన పీస్ బోర్డ్ సమావేశంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి మాట్లాడుతూ, అధ్యక్షుడు ట్రంప్ జోక్యం వల్ల 3.5 కోట్ల ప్రాణాలు కాపాడారని అన్నారు. వారు చాలా ప్రమాదకర చర్యలకు సిద్ధమవుతున్నారు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్?–పాక్ ఘర్షణ సమయంలో 10 యుద్ధవిమానాలు కూల్చివేసినట్లు ట్రంప్ తెలిపారు. గురువారం 11 విమానాలు కూల్చివేశారని చెప్పిన ఆయన, ఇప్పుడు సంఖ్యను 10కి తగ్గించారు. ఆ యుద్ధం అణు యుద్ధానికి దారితీసేలా సాగుతోందని అన్నారు. దానిని టారిఫ్‌ల ద్వారానే ఆపినట్లు చెప్పారు. ఇరు దేశాలకు యుద్ధం చేయాలనుకుంటే చేయండని, కానీ అమెరికాతో వ్యాపారం చేయలేరు తేల్చి చెప్పాను. ప్రతి దేశంపై 200 శాతం టారిఫ్ విధిస్తాను హెచ్చరించాను. దీంతో ఇరుదేశాలు ఫోన్ చేసి విరమణ ఒప్పందానికి వచ్చినట్లు చెప్పారని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు తన పన్నుల విధింపు అధికారాన్ని కట్టడి చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. శ్వేతసౌధంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన న్యాయవ్యవస్థపై ధ్వజమెత్తారు. ఈ తీర్పు దేశానికి తీరని అవమానమని, కొందరు న్యాయమూర్తులకు దేశం కోసం సరైన నిర్ణయం తీసుకునే ధైర్యం లేదని విమర్శించారు. అంతటితో ఆగకుండా, ఈ తీర్పు వెనుక 'విదేశీ ప్రయోజనాలు' ఉన్నాయని, న్యాయమూర్తులు బయటి వ్యక్తుల ప్రభావానికి లోనయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తనను ఆపలేదని ట్రంప్ స్పష్టం చేశారు. పాత చట్టం కింద వేసిన పన్నులను కోర్టు కొట్టివేస్తే, తక్షణమే 'సెక్షన్ 122' కింద 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. "నేను ఎంత పన్ను వేయాలనుకుంటే అంత వేస్తాను. పాత చట్టాల కంటే ఇప్పుడు మా దగ్గర ఉన్నవి చాలా శక్తిమంతమైనవి. అవసరమైతే ఏ దేశంపైనైనా వాణిజ్య దిగ్బంధం విధిస్తాను, ఇతర దేశాల వాణిజ్యాన్ని దెబ్బతీసే అధికారం నాకుంది" అంటూ ఆయన తన దూకుడును ప్రదర్శించారు. సుంకాల విధింపు వల్ల అమెరికాలో పరిశ్రమలు కళకళలాడుతున్నాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. జార్జియాలోని ఒక స్టీల్ ప్లాంట్ యజమాని తనను కలిసి "సార్, మిమ్మల్ని ముద్దు పెట్టుకోవాలని ఉంది" అని అన్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. విదేశీ వస్తువుల దిగుమతి ఆగిపోవడంతో అమెరికాలో నిరుద్యోగం తగ్గిందని, స్టాక్ మార్కెట్ 50 వేల మార్కును దాటిందని ఆయన గర్వంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు తీర్పుతో గతంలో వసూలు చేసిన సుమారు 175 బిలియన్ డాలర్ల పన్ను ఆదాయం ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఆ డబ్బును వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందా? అన్న ప్రశ్నకు.. "కోర్టు ఆ విషయం గురించి చర్చించలేదు, దీనిపై మరో ఐదేళ్ల పాటు కోర్టులో పోరాటం సాగుతుంది" అని ట్రంప్ దాటవేశారు.

మొదటిపేజీ తరువాయి

## డిసిసి అధ్యక్ష పదవి ఎదిగేందుకు

# తొలిమెట్టు

పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఈ తరగతులు సహాయపడతాయని సీఎం అన్నారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు బయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారని తెలిపారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం.. అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు' అని రేవంత్ అన్నారు. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు.రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని.. మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని.. ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడన్నారు. 'డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు' అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనాయకులను అవమానపరచాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం నుంచి షర్మిల వచ్చినా ఆమె అవకాశాలను తీసుకోలేదన్నారు. ముళ్లబాటలో కూడా ఏపీలో కాంగ్రెస్ కోసం షర్మిల కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజల దగ్గరికి వెళ్ళి రాజకీయాల్లో రాణించాలని షర్మిల చేస్తున్న కృషిని ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరయ్యారు. అలాగే, రెండు రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు

మొదటిపేజీ తరువాయి

## లడ్డూ గురించి మాట్లాడితే హెరిటేజ్‌ను

# ముందుకు తెచ్చారు

లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందన్నారు. తప్పు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ్గ÷ర్ అయ్యారు. తప్పును పక్క వాళ్లపై నెట్టే నీచులు కూడా ఉన్నారన్నారు. అలాంటి కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయం చేయాలా అని విమర్శించారు. తాను కూడా జైలుకు వెళ్తానని ఊహించలేదని.. నోటీసు ఇస్తే సమాధానం చెప్పేవాడినని సీఎం చంద్రబాబు అన్నారు. 'నా ప్రాణం పోయినా పరవాలేదు... రాష్ట్రం కోసం పోరాడతాను' అని చెప్పుకొచ్చారు. చాలా మంది తాను జైల్లో నుంచి ప్రాణాలతో బయటకురారని అనుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మట్లాడుతున్నారని.. రెచ్చగొట్టే పనులు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. డ్రగ్స్ మత్తులో ఆడబిడ్డల జోలికొస్తే వారికదే చివరిరోజు అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వివేకా హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని.. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవేదన కలిగించిందన్నారు. కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదన్నారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని తెలిపారు. దేశానికి మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు

## పేదల సొంతింటి కల నెరవేర్చడం

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం

**గ్రామీణ ప్రాంతాల్లో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు**

**కనీసం ఈ ఏడాదిలోనైనా 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి**

**కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి**

హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014–23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమాన్ని విస్మరించిన ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలల్లో కేంద్రం నుండి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలకు ఇండ్లు మంజురు చేయాలని గడిచిన రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం. కానీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇండ్లు మంజురు చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం హైదరాబాద్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రెండేళ్ల క్రితం రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వచ్చే మూడు సంవత్సరాలలో రాష్ట్రం లో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజురు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 1.0లో భాగస్వామ్యం కాలేదు. అయితే 2023 తరువాత మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం 2.0 లో రాష్ట్రం అధికారికంగా చేరింది.2024 ఆగస్టులో కేంద్ర మంత్రివర్గం 2.0కు ఆమోదం తెలిపి, ఆవాస్–?2018 సర్వే నవీకరణ తర్వాత సాచురేషన్ పద్ధతిలో గృహాల మంజూరు చేయాలని నిర్ణయించినప్పటికీ, పాత డేటా ఆధారంగా 2024–25 మరియు 2025–26 సంవత్సరాలకు ఇతర రాష్ట్రాలకు 1.19 కోట్ల గృహాలను కేటాయించింది. తెలంగాణ రాష్ట్రం ఖఓఉజ 1.0 లో భాగస్వామ్యం కాకపోవడంతో 2018 పెండింగ్ డాటా లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ విస్తృత సర్వే నిర్వహించి అర్హులైన లబ్దిదారుల డేటాబేస్‌ను సిద్ధం చేసుకుంది. అయినప్పటికీ, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్?2024 మొబైల్ యాప్ ద్వారా మరోసారి సర్వే నిర్వహించి మొత్తం 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లలో ఏర్పడిన పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని పరిస్థితులను అర్థం చేసుకొని ఈ ఆర్థిక సంవత్సరములో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఇండ్లను మజూరు చేయాలని' మంత్రి పొంగులేటి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని మన్నించిన సిసిఐ

హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

రాష్ట్రంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని, ఈ అవకాశాన్ని పత్తిరైతులు వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.తమ అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు సీసీఐ పొడిగించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కోరినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. పొడిగించిన గడువును వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులను మంత్రి తుమ్మల కోరారు.రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, రాష్ట్రంలోని పత్తి రైతులకు ఇబ్బంది కలగకుండా, ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించాలని సీసీఐ అంగీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. రైతుల ప్రయోజనాలను ప్రాధాన్యంగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ వాస్తవ పరిస్థితిని కేంద్రానికి వివరిస్తూ కొనుగోళ్ల గడువును పొడిగించాలని మంత్రి గారు కోరారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో రాష్ట్ర పరిస్థితిని వివరించి, రైతులకు నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 45.32 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేయడం జరిగింది. ఇప్పటివరకు 8,80,053 మంది రైతుల నుంచి రూ.12,823 కోట్ల విలువైన 16.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అదేవిధంగా ఇప్పటివరకు మార్కెట్ ద్వారా 2.24 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యత ప్రమాణాలు లేని పత్తిని కొనుగోలు చేయడం జరిగింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఇంకా 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ పై మొదట రైతులు మరియు జిన్నర్ల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన యాప్ కి రాష్ట్ర ప్రభుత్వం సపోర్టు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీంతో ఈ యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతులకు సమయానికి ఎరువుల పంపిణీకి తమ సర్కారు మొబైల్ యూరియా బుకింగ్ యాప్ ని తీసుకొచ్చిందన్నారు. తద్వారా యూరియా బ్లాక్ మార్కెటింగ్ అరికట్టడంతో పాటు అధిక నిల్వలను నియంత్రిస్తూ పారదర్శక పంపిణీ వ్యవస్థ అమల్లోకి వచ్చిందన్నారు. పంట పూర్తిగా మార్కెట్‌కు రాకముందే సీసీఐ వారు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తారనే సమాచారంతో రైతుల్లో ఆందోళన నెలకొందని, నాణ్యమైన పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందనే భయం రైతుల్లో ఉన్న నేపథ్యంలో, మరో 30 రోజులు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని మంత్రి తుమ్మల సీసీఐను ప్రత్యేకంగా కోరారు. రాష్ట్రంలోని ప్రతి పత్తి రైతు తన పంటను పూర్తిగా విక్రయించే వరకు కొనుగోలు కేంద్రాలను తెరిచి ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సీసీఐ సీఎండీ శ్రీ లలిత్ కుమార్ గుప్తా మరియు కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్‌లకు మంత్రి ఆదేశాలతో వ్యవసాయశాఖ సెక్రటరీ లేఖ రాశారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనుగోళ్ల గడువు పొడిగించడంతో రైతులకు ఉపశమనం లభించిందని మంత్రి తెలిపారు. పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకొని రైతులు సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చి మద్దతు ధరకు విక్రయించుకోవాలని మంత్రి కోరారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

## మహిళల ఆర్థిక సాధికారతే

# తెలంగాణ ప్రగతి

46.68 లక్షల మంది మహిళలు 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సా ధికారతకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. గడిచిన రెండేండ్లలో మహిళా సంఘాలకు రూ.35.435 కోట్ల బ్యాంకింగ్ రుణాల మంజూరు చేశామన్నారు.ఇందిరా మహిళా శక్తితో 2.05 లక్షల సూక్ష్మ వ్యాపారాలను మహిళా సంఘాలు స్థాపించాయని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ జాతరలో ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాలకు రూ.3.5 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. వారికి స్థిరమైన ఆదాయం కల్పించేందుకు ఆర్టీసీ అ÷–దదె బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷–లాంట్లు మహిళా సంఘాలతో ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. జీడీపీలో మన దేశ మహిళల భాగస్వా మ్యం 18 శాతమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 40 శాతంగా ఉందన్నారు. మంత్రి సీతక్క ప్రసంగాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు.

మొదటిపేజీ తరువాయి

## దేశం నుంచి

## చొరబాటుదార్లను తరిమేస్తాం

**ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం**

**కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక**

గౌహతి,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు' అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు.రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

## స్వావలంబనతోనే

# అభివృద్ధి సాధ్యం

ఈ నేపథ్యంలో చిప్‌ల తయారీలో స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత దశాబ్దంలో సాంకేతికపరంగా మనం తీసుకుంటున్న చర్యలు.. 21వ శతాబ్దంలో దేశ శక్తిసామర్థ్యాలకు పునాదులు అవుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ సంస్థలు కలిసి జేవర్‌లో 'ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్' (ఓఎస్ఏటీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాయి. దీని కోసం రూ.3,700 కోట్ల పెట్టుబడిని ప్రకటించాయి. 2028 నాటికి ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ పరిశ్రమ 3,500 ఉద్యోగాలు సృష్టిస్తుందని అంచనా. ఈ ప్లాంట్ నెలకు 3.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

మొదటిపేజీ తరువాయి

## పాక్‌లో ఆత్మాహుతి దాడి

# మొత్తం16మంది దుర్మరణం

అయితే.. సైన్యానికి చెందిన వాహనం దాడులను తట్టుకునేలా ప్రత్యేకంగా రూపొందించినది కావడంతో పేలిపోలేదు. దీనివల్ల వాహనానికి తీవ్ర నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. పేలుడు ధాటికి ఓ నిఘా సంబంధిత ఆపరేషన్లో పాల్గొంటున్న కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ షాజాదా గుల్ మృతిచెందినట్టు సమాచారం. అయితే.. అఎ÷–గానిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఇటీవలి కాలంలో ఉగ్ర సంఘటనలు పెరిగాయి. కొద్ది రోజుల క్రితం.. తెహ్రీక్–ఎ–తాలిబాన్ పాకిస్థాన్(టీటీపీ) బజౌర్ జిల్లాలోని ఓ చెక్‌పాయింట్‌ను పేలుడు పదార్థాలతో కూడిన వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో 11 మంది భద్రతా సిబ్బంది సహా 12 మంది ప్రాణాలు కోల్పోయారు.

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
22 ఆదివారం, ఫిబ్రవరి 2026
3
www.prajaveekshanam.in

# రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు విద్యార్థినీ ఎంపిక

**ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్**



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పుల్లూరి రచన, జిల్లా స్థాయిలో రాణించి, రాష్ట్రస్థాయి సీఎం కప్ ఖోఖో పోటీలకు ఎంపికవడం పట్ల శనివారము ఎంఈఓ నిమ్మ రాజిరెడ్డి, పిఈటి అంకం రాజశేఖర్, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేసి అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

# అనేక భాషా పదాల కలయిక ఉర్దూ భాష.

## - డాక్టర్ ఆదిల్ ఉర్దూ రచయిత

## అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా ఉర్దూ భాష పుట్టుక వివరణ

**ప్రజా వీక్షణం న్యూస్ ఆదిలాబాద్ :**



అనేక భాషా పదాల కలయికయే ఉర్దూ భాష,ధ్వని మరియు అర్థవంతమైన పదాల సమాహారమే భాష అని ఉర్దూ రచయిత డాక్టర్ ఆదిల్ తెలిపారు.ఆదిలాబాద్ ప్రముఖ ఉర్దూ రచయిత అయిన డాక్టర్ ఆదిల్ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా శనివారం ఉర్దూ భాష పుట్టుకపై తన అభిప్రాయం వెలిబుచ్చారు.“ఉర్దూ“ అనే పదం తుర్కీ భాష నుంచి వచ్చింది.దీని అర్థం సైన్యం లేదా సమూహం.ఉర్దూ భాష యందు ఇతర అనేక భాషల నుండి పదాలు చేర్చబడ్డాయని ఇది ఒక సాధారణ భాష అని ఆయన పేర్కొన్నారు.ఉర్దూ భాష చరిత్రను చూసినట్లయితే మొగల్ చక్రవర్తి షాజహాన్ పాలనలో ఉనికి లోకి వచ్చిందని,కొంతమంది అక్బర్ చక్రవర్తి పాలనలో ఉంకిలోకి వచ్చిందని చెబుతారన్నారు.ఆరోజులలో మొగల్ సైన్యం నందు వేరువేరు ప్రాంతాల నుండి వేరువేరు భాషలు మాట్లాడే సైనికులు పనిచేసేవారు.పరిచయం చేసుకోవాలన్న కలిసి పని చేయాలన్న వారు తమ తమ భాషలతో పలకరించుకునేవారు.ఈ విధంగా ఇతర భాషల పదాలు కలిసి ఒక నూతన భాష “ఉర్దూ“ ఏర్పడిందన్నారు.ఉర్దూ అనేది అరబీ,ఫార్సీ,తుర్కి,హిందీ,సంస్కృతం లాంటి డజనుకు పైగా భాషా పదాల సంగ్రహమని ఆయన పేర్కొన్నారు.ఉర్దూ రసవత్తరమైన,మర్యాద పూర్వక భాష అని తన మాతృభాషపై మమకారం చాటుతూ,కొనియాడారు.

# మున్సిపల్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన బండారి అనూష

## పట్టణ ప్రగతికి కృషి చేస్తానన్న నూతన చైర్ పర్సన్

**ప్రజా వీక్షణం న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ మున్సిపల్ సర్వతోముఖాభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు.శనివారం ఆమె పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం లోని తన ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు.శాస్త్రోక్త పూజల అనంతరం తన సీట్లో ఆసీనులయ్యారు.సర్వమత ప్రార్ధనలతో ఆశీర్వచనాలు అందించారు.ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు,కౌన్సిలర్లు ఆమెకు అభినందనలు తెలియజేశారు.తనకు పదవి దక్కేలా కృషి చేసిన కంది శ్రీనివాస రెడ్డితో పాటు ప్రతీ ఒక్కరికి అనూష కృతజ్ఞతలు తెలిపారు.49 వార్డులలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.మున్సిపల్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమన్నారు.నూతన మున్సిపల్ చైర్ పర్సన్ కు అన్ని విషయాలలో తగిన తోడ్పాటునందిస్తూ ఆదిలాబాద్ ను క్లీన్ అండ్ గ్రీన్ గా తీర్చిదిద్దుతామని అభివృద్ధి చేస్తామని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్,కౌన్సిలర్లు,ఆత్మ చైర్మన్ సంతోష్ రావు,డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి,గంద్రత్ సుజాత,పట్టణ కాంగ్రెస్ ముఖ్య నేతలు,కార్యకర్తలు మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ స్థాయి కబడ్డీ పోటీకి ఎంపిక అయిన క్రీడాకారుడు టి. శివ కృష్ణ.

**ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.**



ఆత్మకూరు మండలం మూలమళ్ళ గ్రామానికి చెందిన టి. శివ కృష్ణ జాతీయ స్థాయి కబడ్డీ పోటీకి ఎంపిక అయ్యారు.ఈ నెల 24 నుండి 27 వరకు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వడోదర గుజరాత్ లో జరగబోయే 72వ, సీనియర్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు మూలమల్ల గ్రామానికి చెందిన క్రీడాకారుడు టి. శివ కృష్ణ తెలంగాణ రాష్ట్ర సీనియర్ కబడ్డీ టీంకు ఎంపిక కావడం జరిగింది ఎంపిక అయినటువంటి శివకృష్ణను వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ దేశాయి పద్మజా రెడ్డి మూలమల్ల గ్రామ సీనియర్ క్రీడాకారులు ఎల్లప్ప, చంద్రశేఖర్ గౌడ్, వెంకట రాములు, అశోక్, శ్రీనివాసులు అభినందించారు.

# “నిర్వహణ” సిద్ధంతంగా మారిన “నియంత్రణ” నినాదం

# శతాబ్ధంలో కొత్త శబ్ధం:

మోహన్ భగవత్... హిందూ మూలాలతో పరోక్షం గా దేశాన్ని నడిపిస్తున్న కీలక వ్యక్తి. ఆర్ఎస్ఎస్ చీఫ్ కూడా... ఆయన ఏ వ్యాఖ్యలు చేసినా వెనుక అంతర్యార్థాలు ఎన్నో కనబడతాయి... ఇటీవల ూూ శాతాబ్ధి వేడుకల్లో మోహన్ భగవత్ మరో కొత్త నినాదాన్ని అందించిండ్రు. అదే ప్రతొక్కరూ ముగ్గురు పిల్లలు కనాల్సిందేనని... దేశంలో కొన్ని నివేదికలు కూడా జనాభా విషయంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది అవ సరమని స్పష్టం చేశాయి. దీని ఆధారంగా దేశాన్ని దృష్టిలో ఉంచుకొని చెబుతున్నట్లు తెలిపిండ్రు.. ప్రస్తుతం దేశంలో సరిపడే జనాభా ఉండాలి, లేకుంటే దేశంలోని కాలానుగుణంగా సమస్యలను ఎదుర్కోలేం, అందుకే ప్రతొక్కరూ ముగ్గురు మాత్రమే.. ఎక్కువ ఉండకూడదనేది అందరూ అంగీకరించాల్సిందేనని తెలిపిండ్రు.. హిందూ సమాజాన్ని ఐక్యం చేసి సాధి కారత కల్పించాలని పిలుపు నిచ్చిండ్రు. హిందూ కుటుంబాలు ముగ్గురు పిల్లలను కనాలి.. అలాగే చొరబాటు దారులు, మతం మారినోళ్లను గుర్తించాలి, ఉద్యోగాల్లో ఉంటే వారిని బహిష్కరించాలి. ఇదే హిందూ సమాజానికి కీలక మందు. తగ్గుతున్న హిందూ జనాభాను చూస్తే ఆందోళనకరంగా ఉందని మోహన్ భగవత్ అన్నారు. ఇప్పటికే హిందూ కుటుంబాలు సగటు కంటే తక్కువగా సంతా నోత్పత్తి ఉన్న సమాజాలు భవిష్యత్తులో నిర్వీర్యమవుతాయని చెప్పిండ్రు... ప్రస్తుతం ముందున్న పరిష్కారం కొత్త జనరేషన్ కు ముగ్గురు పిల్లల అవగాహన కల్పించాల్సిందే, సృష్టిని ముందుకు తీసుకెళ్లడమే మన లక్ష్యం. పౌర సమాజమంతా ఒకే దేశం, ఒకే జన్మభూమిపై పట్టు బిగించాలి. కాలానుగుణంగా సనాతన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని దేశానికి పిలుపునిచ్చారు... మన దేశ సాంప్రదాయం మహిళలకు గౌరవ ప్రదమైన స్థానం ఇస్తుంది, యావత్తు ప్రపంచంలోని సమస్యలకు పరిష్కార మార్గాలు మన దేశ నాగరికతలో ఉన్నాయి.. అందుకోసం బలహీన వర్గాలకు మద్దుతుగా నిలిచి సమాజిక సామ రస్యాన్ని పెంపొందించాలని మోహన్ భగవత్ అన్నారు... పరోక్షంగా అమెరికా, చైనాలో కొన్ని శక్తులు దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తు న్నాయని విమర్శించారు. కెరీర్ అంటే కేవలం ఎక్కువ సంపాదించడం లేదా వినియోగించడం కాదు.. ఇతరులను పంచుకోవడం, సేవ చేయడమనేది పిల్లలకు నేర్పించాలి. ముఖ్యంగా దేశానికి అన్నిటికంటే ఉన్నత విలువలు ఉన్న కుటుంబాలను అందించాలి. సమాజానికి వ్యక్తి కాదు, కుటుంబమే ప్రాథమిక యూనిట్ అని, సామాజిక ప్రవర్తన దానిలోనే రూపుదిద్దు కుంటుందని భగవత్ అన్నారు.

**కాలంతో కరిగిపోయిన నినాదం:**

1990లో దేశ జనాభా విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో యావత్ దేశం ఆందోళనలో పడింది. అప్పట్లో జనాభా నియంత్రణ కోసం అందు బాటులో ఉన్న అవకాశాలన్నీ ఉపయోగిం చేశారు. “ముగ్గురు వద్దు... ఇద్దరు ముద్దు” అనే నినాదాన్ని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ఉద్యమంలా ప్రచారాలు చేశాయి. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే పథకాలు రావని, అనర్హతగా పరిగణించి కట్టడి చర్యలు తీసుకున్నారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు కూడా ఇద్దరు పిల్లల నిబంధన గ్రామ, పట్టణ అమలు చేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరా ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నిబంధనలతో చట్టాలు చేసి అమలు చేస్తున్నారు. జనాభా పెరగడం వల్ల వచ్చే అనర్థాలను కళ్లకు గట్టినట్లు చెప్తూ ప్రచారం చేసేవారు. అయితే కాలం మారే కొద్ది ఇద్దరు బిడ్డల నినాదం మరింత బలంగా మారి ఆర్థిక అవకాశాలకు తలొగ్గి ఒక్కరికే పరిమితమైన కుటుంబాలు పెరిగాయి. అధిక సంతానం వల్ల వారి పోషించడంలో భారం, చదువు వ్యయం భరించలేమన్న భయం బాగా ఫలించింది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. సరికొత్త నినాదం అమల్లోకి వచ్చింది. పిల్లలను ఎక్కువ మందిని పిల్లలు ఉంటేనే జాతి నిర్వీర్యాన్ని అడ్డుకోగలమని ముందున్న లక్ష్యంగా మారింది. ఒకప్పుడు స్థానిక సంస్థలు, సర్పంచ్ ఎన్నికల్లోనూ ముగ్గురు పిల్లలు ఉంటే పోటీకి అనర్హులుగా ప్రకటించారు. సమాజంలో ఇద్దరు పిల్లలు నినాదాన్ని బలేపేతం చేసేందుకే ఆ నిబంధనను అనుచరించిండ్రు.. తాజాగా మరిన పరిస్థితుల దృష్ట్యా నిబంధను కూడా ఎత్తివేసే పరిస్థితి వచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నిబంధన ఎత్తివేయడంపై చర్చనీయంగా మారింది. మొన్నటి వరకు పాత నిబంధననే అమలులో ఉంచిండ్రు.. కొత్త చట్టాన్ని రూపొందించినప్పుడు ప్రభుత్వాలు మార్చుకోలేదు. పలు రాజకీయ పక్షాలతో పాటు ప్రముఖులు నిబంధన ఎత్తివేయాలని కోరడంతో ఇద్దరు పిల్లల నిబంధనకు చెక్ పడింది. తెలంగాణలో ఆమోదానికి రాలేదు కానీ ఆంధ్ర ప్రదేశ్ లో మాత్రం చంద్రబాబు పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించి ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉన్నా పోటీ చేసుకునేలా వెసులుబాటు కల్పించింది.

**ముగ్గురు పిల్లల వెనుక అంతర్భావం:**

మోహన్ భగవంత్ సంఘ్ సభలో ప్రకటించిన నినాదంపై పలు అను మానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఇప్పుడిప్పుడే చెబుతున్నది కాదు.. ఎంతో కాలం నుంచి జనాభా విషయంలో అప్రమత్తంగా ఉండాలని జనాభా పెరగాలని చెప్పుకుంటూ వస్తున్నారు అయితే అది ఒక వర్గానికి అనుసరించినదే. ఎన్నికల సమయంలో చంద్రబాబు కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పిండ్రు. అయితే ఒక బ్రహ్మచారి.. కుటుంబ విలువలు, భావనల కోసం చెప్పడం హాస్యా స్పదంగా ఉందనేది పలువురి ప్రముఖుల మాట. అన్ని మతాలను విమర్శించకుండా పిల్లలను కనాలని చెప్పడం వెనుక స్వార్థపూరికతమైన లక్ష్యం కనబడుతోంది. ఎక్కువ మంది పిల్లలతో జిందగీని సాగించేవాళ్లకు తెలుస్తుంది నొప్పేంటోనని, సనాతన ధర్మాన్ని అడ్డుపెట్టుకొని స్వార్థ భావనలు ప్రచారం చేసిన సన్నా సులకు, కుటుంబ బతులకులంటే తెలియని బ్రహ్మచారులు, సాధువులు, మునులకు ఎలా తెలుస్తుంది?. ముందుగా ముగ్గురు పిల్లలను వర్గంలో ఎంతమంది కంటున్నారు, వాళ్లకు బతుకు భరోసా ఎలా ఉందో, జనాభా పెరగాలన్నే లక్ష్యానికి ఎంతమంది కట్టుబడి ఉన్నారో అనేది ఆచరణలో చూపించాలి. జనాభా రేటు తగ్గడమనేది నిరంతరంగా జరుగుతున్న ప్రక్రియనే... అయితే హిందూ సమాజం తగ్గుతోందనడం సరైనదికాదు.. ఓట్ల కోసమే బలం మాటున భావనను ప్రదర్శిస్తున్నారనేది కనబడుతోంది. దేశంలో ముస్లిం, ఇతర మతాలు రాకముందు ఉన్న మత మేంటి..? దానితో మనకు ఒరిగిం దేమిటి ? జనాభా పేరుతో హిందువులు తగ్గుతున్నారనేదే ముఖ్యమైన అంశం. ప్రస్తుతం హిందువుల మనుగడ పుట్టే పిల్లలపై ఆధారపడి ఉందనేది తెలుస్తుంది.. మరో వర్గం ముస్లింలను అడ్డుకొనే శక్తి కోసమే పిల్లలు కనాలనేది కనబడు తోంది. హిందూ సమాజం నిర్వీర్యం అయితే ఏం జరుగుతుంది.. ఇతర దేశాల్లోనూ మన దేశ సంతతివాళ్లు ఉన్నారు.. మరి అక్కడ దేశ సంస్కృతులు పాటించకుండా ఉండలేరెమో కాదా...? మన దేశంలో హిందు మాటున ఉన్న హింసాత్మక వ్యక్తుల మనుగడ కోసం నినాదాలను తీసుకొస్తున్నారు.

**ఎవరిది తప్పు:**

దేశ ఆర్థిక బలం కోసం, మానవాభివృద్ధి పేరుతో సంతానోత్పత్తిని తగ్గించే చర్యలు కొనసాగుతున్నప్పుడూ జనాభాలో తగ్గుముఖం పడుతూనే వస్తోంది. అప్పటికి ఆర్థిక బలమే నిజమైన నినాదం... మూలాలు అంటూ హిందు సమాజానికి పిలుపునిచ్చి ముందుకు తీసుకెళ్లారు... మరో పక్క ముస్లిం వర్గంలో మాత్రం పిల్లలు భవిష్యత్తు దేవుళ్లగా పరిగణించి ముందుకెళు న్నా వాళ్లనూ జనాభా సమతూకంలో ఉండాలని కట్టడి చర్యలకు గురి చేశారు.. అయినా వాళ్లు పరోక్షంగా పిల్లల భవిష్యత్తేనే కొనసాగించారు. ఇప్పుడు జనాభా నియంత్రణ నుంచి జనాభా నినాదానికి మార్చుకుంటున్నారు. పిల్లలను కనాలి.. ఎంత మంది కనాలని చెప్తే అంతే కనాలి... ఇదే ఆర్ఎస్ఎస్ కు ఉన్న స్వార్థపూరితమైన లక్ష్యం.. మతానికి బలం చేకూర్చేందుకు పిల్లలు అవసరమైతే కనాలనే చెబుతున్నారు.. మరి ఆర్థిక బలం సంగతేంటి..? జనాభా తగ్గితే అభివృద్ధికి మూలం అన్నారు.. ఇప్పుడేమో జనాభా పెరగాలంటున్నారు. ఇప్పటి వరకు ఆర్థిక బలమూ లేదు, అభివృద్ధి లేదు.. కేవలం మతోన్మాద బలమే సాధించినట్లా... ఇతర ముస్లిం, క్రైస్తవ దేశాల్లో సంతానోత్పత్తితో సమానంగా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే చర్యలు పాటించి నాయి..ఎంత పెద్ద కుటుంబమైనా, ఎంతమంది పిల్లలు ఉన్నా ఆర్థిక భరోసాను బాధ్యతగా తీసుకున్నాయే తప్ప ఎలాంటి కట్టడి చర్యలు తీసుకోలేదు..మరి మనదేశంలో జరుగుతున్నదేంటి..? పిల్లలను కనాలని చెబుతున్న ఆర్ఎస్ఎస్.. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బాగోగుల కోసం ఏం చేస్తుంది.. మద్దతు ప్రభుత్వాలకు ఏం భరోసా ఇస్తుందో స్పష్టం చేయాల్సిందే.

**పట్ట. హరిప్రసాద్, రైటర్**

**ఫోన్: 8790 84 3009**

# సీఎం కప్-2025లో కాగజ్‌నగర్ ముత్తు బాక్సింగ్ క్లబ్ క్రీడాకారుల కాంస్య పతకాలు..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ముత్తు బాక్సింగ్ క్లబ్ క్రీడాకారులు సీఎం కప్2025 (2వ ఎడిషన్) పోటీల్లో ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీలు మహబూబ్‌నగర్లో ఘనంగా నిర్వహించబడ్డాయి. 5254 కేజీల విభాగంలో యేశ్వంత్ కాంస్య పతకం గెలుచుకోగా, 4648 కేజీల విభాగంలో హర్షిత కాంస్య పతకం సాధించింది. అలాగే 4446 కేజీల విభాగంలో శ్రేష్ఠ కాంస్య పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది.ముత్తు బాక్సింగ్ క్లబ్ క్రీడాకారుల విజయంతో కాగజ్‌నగర్ పట్టణంలో ఆనంద వాతావరణం నెలకొంది. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా తమ ప్రతిభను చాటుకున్న ఈ క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కొమురం భీమ్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి మధురై శేఖర్, అధ్యక్షుడు వి. మధు విజేతలను అభినందించారు. అలాగే కోచ్‌లు సాయి, శివ, వంశీ క్రీడాకారులను ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసి, మరింత కృషితో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని సూచించారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించడం జరిగింది.కళాశాలలోని తెలుగు, హిందీ,ఇంగ్లీష్ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులకు మాతృ భాష పరిరక్షణ, ప్రాధాన్యతపై అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు.కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ మాతృభాష, భావ ప్రకటనలో ఎంతో శక్తివంతమైన సాధనం అన్నారు.నూతన అంశాలను నేర్చుకోవడంలో మాతృభాషను మించిన మాధ్యమం మరోటి లేదని తెలిపారు.కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.డి.లక్ష్మినరసింహం మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలలో మాతృభాషలోనే విద్యాబోధన జరుగుతుందని కాబట్టి మాతృభాషను విస్మరించలేమని తెలిపారు.కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్ధన్ మాట్లాడుతూ మాతృభాషలో విషయాన్ని సులభంగా గ్రహించవచ్చని తెలిపారు. అనంతరం కళాశాల విద్యార్థులు మాతృభాష ప్రాధాన్యతపై పాటలు,గేయాలు ఆలపించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజేశ్వర్,మహేశ్,శారద,సంతోష్, అపూర్వ మహా లక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## నయా నియంతృత్వంలో ట్రంప్

ట్రంప్ కారణంగా ప్రపంచ దేశాలకు పీడతప్పడం లేదు. సుంకాలపై అమెరికా సుప్రంకోర్టు చెంప ఛెళ్లు మనిపించినా తగ్గేది లేదంటున్న ట్రంప్‌తో చిక్కులు, ముప్పు తప్పేలా లేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, సుప్రీం తీర్పును అధ్యయనం చేస్తున్నామని ప్రకటించారు. ఇది ఓ రకంగా అమెరికా పౌరులకే కాకుండా, ప్రపంచ పౌరులకు కూడా అశనిపాతం లాంటిది. ఇంకా చెప్పాలంటే ప్రపంచానికి ట్రంప్ ఇప్పుడు గుదిబండగా మారారు. ఆయన యుద్ద పిపాస కూడా ప్రపంచ దేశాలకు శాపంగా మారుతోంది. అధికారం లేకున్నా.. అత్యవసర చట్టం కింద అడ్డగోలు సుంకాలు విధిస్తామంటే కుదరదని.. అది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది తప్ప.. రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును కార్యనిర్వాహక శాఖకు అప్పగించలేదని స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెబితే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అమెరికా ప్రయోజనాలకే విరుద్ధంగా ఉందంటూ ట్రంప్ మండిపడ్డారు! విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారంటూ జడ్జీలపైనే ఆరోపణలు చేశారు. వారు అమెరికాకే అవమానకరమని దుయ్యబట్టారు. సుంకాలపై తగ్గేదేలేదని..వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. వేరే చట్టాల కింద..అన్ని దేశాలపైనా 10శాతం ప్రత్యామ్నాయ సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అంటే కోర్టులన్నా ట్రంప్ లెక్కచేయడం లేదని అర్థం చేసుకోవాలి. ఇది ఓ రకంగా చెప్పాంటే నాజీలను మించిన నియంతృత్వ ధోరణిలో ట్రంప్ ఉన్నారు. నాజీనేత హిట్లర్‌ను మించిన నియంతగా ఇప్పుడు ట్రంప్ అవతరించాడు. ముక్కుపిండి సుంకాలు విధించడం, యుద్దాలతో బెదరించడం అలావాటు చేసుకున్న ఆధునిక నియంతలా ట్రంప్ మారాడు. ఇది ప్రపంచానికి ఓ హెచ్చరిక కావాలి. 'విమోచన దినం' పేరుతో గత ఏడాది ఏప్రిల్ 2వ తేదీన.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద పలు దేశాలపై ఆయన విధించిన భారీ టారిఫ్‌లను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు నిచ్చింది. ఆ చట్టం కింద ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప సుంకాలు విధించే హక్కు ఉండదని తేల్చిచెప్పింది. తన అధికార పరిధిపై ట్రంప్ చేసిన అత్యంత వివాదాస్పద వాదనలను తోసిపుచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని.. టారిఫ్‌లు కూడా పన్నుల్లో భాగమేనని మెజారిటీ జడ్జిలు స్పష్టం చేశారు. అయితనా జడ్జిల తీర్పును తప్పు పట్టారు. ఇది న్యాయవ్యవస్థ ఉనికికి కూడా సవాల్ లాంటిదే. సుప్రీం తీర్పును కూడా సవాల్ చేసే స్థితికి ఇప్పుడు ట్రంప్ ఎదిగారంటే ఏమవుతుందో అన్న భయం అమెరికన్ల లోనే ఎక్కువగా ఉంది. టారిఫ్‌ల రూపంలో తాము కట్టిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ అతి పెద్ద వేర్‌హౌస్ చైన్ కాస్ట్‌కో సహా పలు కంపెనీలు ఇప్పటికే దిగువ కోర్టులకు క్యూ కట్టిన నేపథ్యంలో.. ఆ పక్రియ సంక్లిష్టంగా ఉండొచ్చని న్యాయమూర్తి బ్రెట్ క్యావనో అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఆయన తన తీర్పులో భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాల గురించి కూడా ప్రస్తావించారు. చైనా, యూకే, జపాన్, ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ఈ సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధించారు. రష్యా చమురు కొనబోమని భారత్ హామీ ఇవ్వడంతో ఆ సుంకాలను తొలగించారని క్యావనో గుర్తుచేశారు. ఇక.. ఈ తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్ సూచీల్లో పెరుగుదల కనిపించింది. అంటే ఓ రకంగా మార్కెట్లు కూడా సుంకాల బారిన పడి విలవిల్లాడుతున్నాయని గుర్తించాలి. ట్రంప్ విధించిన టారిఫలతో అమెరికా ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 14 దాకా 3,01,000 మందికిపైగా దిగుమతిదారుల నుంచి 133 బిలియన్ డాలర్లు అంటే రూ.12 లక్షల కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా వసూలైన మొత్తం కూడా కలిపితే అది 175 బిలియన్ డాలర్ల రూ.16 లక్షలకోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇవి ఓ దేశ బడ్జెట్‌కన్నా ఎక్కువే. ట్రంప్ ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం.. అమెరికా వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను దెబ్బతీయడమే కాక, ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అనిశ్చితికి కారణమైంది. ట్రంప్ టారిఫ్ విధానాలు చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్లైందని కెనడా అభిప్రాయపడింది. తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామని యూరోపియన్ యూనియన్ తెలిపింది. పరిస్థితులు ఎలా ఉన్నా అమెరికాతో తమ ప్రత్యేక వ్యాపార, వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని బ్రిటన్ తెలిపింది. అమెరికాతో కలిసి పనిచేస్తామంది. ట్రంప్ టారిఫ్‌ల వల్ల నష్టపోయిన వ్యాపారసంస్థలు, డెమొక్రాట్ల పాలనలో ఉన్న 12 అమెరికా రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ తన అధికార పరిధిని మించి ఈ చట్టాన్ని వాడారని, పన్నులు వేసే అధికారం అధ్యక్షుడికి లేదని దిగువ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కారు ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. సుప్రీం కూడా ఆ తీర్పును సమర్థించింది. ఈ తీర్పును వెలువరించిన ధర్మాసనంలో.. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియమించిన ముగ్గురు కన్జర్వేటివ్ జడ్జీలు ఉన్నారు. దీంతో తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని చాలా మంది భావించారు. ట్రంప్ కూడా.. ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన కేసుల్లో ఒకటని.. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ అవుతుందని హెచ్చరించారు.

# రెండై తిరిగే ఒకే రూపం కవలలు





రమ్య, రవళి



వన్ ప్లస్ వన్ ఆఫర్.. కొన్నిసార్లు మాతృత్వానికి కూడా వర్తిస్తుంది. ఒక్క నలుసు చాలనుకుంటున్న సమయంలో.. గర్భంలో ఇద్దరు బిడ్డలు ఉన్నట్టు వైద్యులు నిర్ధారిస్తారు. అంతే.. అమ్మానాన్నలకు ఆశ్చర్యం, ఆనందం. అంతలోనే కొంత భయం! డెలివరీ సురక్షితంగా అవుతుందో లేదో అన్న అనుమానం. ఇద్దరు పిల్లలకు చనుబాలు సరిపోవన్న అనిశ్చితి. పెంపకం విషయంలో కూడా సవాలక్ష సందేహాలు. నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం. ఈ సందర్భంగా రాముడు–భీముడు, కదలడు–వదలడు, సీత–గీత, గంగ–మంగ దినోత్సవం ప్రతి సంవత్సరము ఫిబ్రవరి 22 న జరుపుకుంటారు . ప్రపంచవ్యాప్తంగా దాదాపు 125 మిలియన్ల 'మల్టీపుల్స్' (ఒకే కాన్పులో జన్మించిన ఒకరికన్నా ఎక్కువమంది) ఉన్నారు. ప్రపంచం లో మొట్టమొదట సారి కవలల దినోత్సవాన్ని పోలెండ్ వారు 1976లో నిర్వహించారు.వేదాల్లో అశ్వినీ దేవతలు, రామయణంలో లవకుశలు, మహాభారతం లో నకుల సహదేవులు కవలలుగా మనకు తెలుసు. ప్రపంచవ్యాప్తంగా గత 35 సంవత్సరాలుగా అంతర్జాతీయంగా అనేక దేశాలలో దీనిని పాటిస్తున్నారు. పోలెండులో జన్మించిన "మోజస్, ఆరన్ విల్‌కాక్స" అనే కవల సోదరులు మరణించిన రోజును ప్రపంచ కవలల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. దీనికి ఒక కథనం కూడా ప్రచారంలో వుంది. మోజస్, ఆరస్ విల్‌కాక్స తాము నివసిస్తున్న ఇంటి (ఊరు) కి ట్విన్స్ బర్గ్ అని పేరు పెట్టుకుని ఎంతో ఆప్యాయతతో ఉండేవారు. వివాహం తరువాత తమ అనుబంధం విడిపోవద్దన్న ఆలోచనతో అక్కచెల్లెళ్ళను వివాహం చేసుకుని, రెండు కుటుంబాలు ఎంతో అనురాగంలో ఉండేవి. విచిత్రంగా ఇద్దరూ ఒకే వ్యాధితో భాధపడుతూ ఒకే రోజున (ఫిబ్రవరి 22న) మరణించారు. బింబప్రతిబింబాల మాదిరిగా ఉన్న ఈ కవలసోదరుల గౌరవార్థం ఆ నాటినుంచి వారు మరణించినరోజును కవలల దినోత్సవంగా జరుపుతున్నారు.ప్రపంచవ్యాప్తంగా 125 మిలియన్ల కవలలు ఉన్నారని 2006వ సంవత్సరంలో జరిపిన ఒక సర్వే ఆధారంగా తెలిసింది. ప్రపంచజనాభా ఇది 1.9శాతం. వీరిలో 0.2శాతం మంది గుర్తించడానికి వీలు కాకుండా అంటే ఒకే పోలికలతో ఉన్నవారే. పుట్టే ప్రతి వెయ్యిమంది కవలలలో 32 మంది మాత్రమే జీవిస్తున్నారని ఈ సర్వేలో వెల్లడైంది. ప్రపంచంలో అత్యధిక కవలల జనాభా కలిగిన దేశం యోరుబా. ఈ దేశంలో పుట్టే ప్రతివెయ్యిమంది శిశువుల్లో 45మంది కవలలే. భారతదేశంలో అలహాబాద్ సమీపంలోని మహమ్మద్ ఉమ్రి అనే అతిచిన్నగ్రామానికి కవలల గ్రామమని పేరు. కారణంలో ఈ గ్రామంలోని ఆరువందలమంది జనభా ఉన్న ఈ గ్రామంలో 33జతల మంది కవలలే ఉన్నారు. చిలీ దేశానికి చెందిన లియొన్ ట్రైన్ అల్బినా 55 మంది కవలలకు జన్మనిచ్చి గిన్నిస్ బుక ఆఫ్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది. ఈమె ఐదు సార్లు ఒక్కోక్క కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చారు. భారతదేశంలో మొదటిసారిగా కవలల పండుగ 2004లో హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ పండుగలో దేశం లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవలలు తన సంతోషాలను పంచుకున్నారు. ట్విన్ ప్యారడైజ్ పేరుతో మేజిక ఫన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పండుగలో వందలాది మంది కవలలు పాల్గొన్నారు. ఇటీవల బెల్జియంలో శతవత్సరాలు నిండిన కవలలు అక్కాచెల్లెలు గబ్రీల్లె వౌడ్రెమర్, మారీ హెండ్రిక్స కుటుంబసభ్యుల సమక్షంలో జన్మదినోత్సవ కేక కట్ చేశారు.ఒకే తల్లి గర్భం నుంచి ఒకేసారి ఒక్కరికన్నా ఎక్కువమంది జన్మిస్తేవారిని కవలలు గా పేర్కొంటారు. ఒకే కాన్పులో ఇద్దరు కవలలు సాధారణంగా జన్మిస్తే , ఒకే కాన్పులో ముగ్గురు నుంచి ఏడుగురు వరకు జన్మించడం అసాధారణంగా జరుగుతుంది. అయితే చాలా సందర్బాలలో వీరు బతికే అవకాశాలు తక్కువ. ఇద్దరు పిల్లల శరీరాలు కలిసిపోయి జన్మిస్తే వారిని అవిభక్త కవలలు లేదా సియామీ కవలలు అంటారు. సాధారణంగా యాభైవేల మంది లో ఒక్కరూ అవిభక్త కవలలుగా జన్మించే అవకాశాలు ఉంటాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. అవిభక్త కవలను చాలా జాగ్రత్తగా సర్జరీ ద్వారా వేరుచేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కవలలు ఒకే పోలికలతో ఉంటే వారిని మోనోజైగోటిక అని, వేర్వేరు పోలికలతో ఉంటే వారిని డైజైగోటిక గా వ్యవహరిస్తారు. కవలలు జన్మించడానికి ప్రధాన కారణాలు రెండు అండాలు విడుదల కావడం, లేదా ఫలదీకరణ చెందిన తరువాత పిండం రెండుగా విభజన చెందడం. రెండు అండాలు విడుదలై, రెండు వీర్యకణాలతో సంయోగం చెందినప్పుడు జన్మించే కవలల్లో ఆడ, మగ పిల్లలు ఉండే అవకాశాలు ఉంటాయి. అలాకాకుండా ఫలదీకరణం చెందిన తరువాత విభజన జరగడంతో జన్మించే కవలల్లో ఇద్దరూ ఆడా, లేదా ఇద్దరూ మగ పిల్లలు జన్మించే అవకాశం ఉంటుంది. వీరిలో పోలికలు చాలా ఎక్కువగా ఉంటాయి. వంశపారంపర్యంగా కూడా కవలలు జన్మించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని డాక్టర్లు సూచిస్తూన్నారు. బిడ్డ కడుపులో ఉండగానే డాక్టర్ల సలహా, సూచనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకుంటే పుట్టిన కవలలు నిండు నూరేళ్లు బతికే అవకాశాలు ఉన్నాయని పరిశోధకులు అంటున్నారు కవలల్లో మూడు రకాలు. ఒకటి.. మోనో జైగోటిక్ ట్విన్స్. రెండు.. డై–జైగోటిక్ ట్విన్స్. మూడు.. కన్‌జాయిండ్ ట్విన్స్. మోనో–జైగోటిక్ కవలల్లో దగ్గరి పోలికలు ఉంటాయి. వీరినే ఐడెంటికల్ ట్విన్స్ అనీ అంటారు. కొన్నిసార్లు ఎవరు ఎవరో పోల్చుకోలేం. ఇలాంటి ఇతివృత్తాలతో చాలా సినిమాలు వచ్చాయి. ఆ కవలలు అబ్బాయి– అబ్బాయి కావచ్చు, అమ్మాయి– అమ్మాయి కావచ్చు, అబ్బాయి– అమ్మాయి అయినా కావచ్చు. డై–జైగోటిక్ ట్విన్స్‌లో పెద్దగా పోలికలు లేకపోవచ్చు. మూడవది, కన్‌జాయిండ్ ట్విన్స్. శరీర భాగాలు అతుక్కుని జన్మిస్తారు. వీణ–వాణి ఇందుకు ఉదాహరణ.బారత్ లో కూడా కవలల సంఖ్య ఎక్కువే వీరి ఆలోచన ప్రవర్తన ఒకే రీతిలో ఉంటాయి చాలా సినిమాలు కూడా వీరి మీద రావడం జరిగింది

# సేవాలాల్ బోధనలు స్ఫూర్తిదాయకం

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రజా వీక్షణం న్యూస్ రామచంద్రాపురం



పటాన్ చెరు లో ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు భారీ ర్యాలీ పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని గిరిపుత్రులు గిరిజనుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు పటాన్చెరు మండలం భానూరు పరిధిలోని బిడిఎల్ లో సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయం నిర్మాణానికి పదిహేను లక్షల రూపాయల సొంత నిధులు అందించనున్నట్లు ఆయన ప్రకటించారు పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో శనివారం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి ఉత్సవాలను అధికారికంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం నుండి జిఎంఆర్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జిఎంఆర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు సేవాలాల్ మహారాజ్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కిందని అన్నారు సామాజిక ఆర్థిక రాజకీయ ప్రభుత్వ ఉద్యోగ రంగాల్లో గిరిజనులకు పెద్ద పీట వేయడం జరిగిందని తెలిపారు గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రత్యేకంగా ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు ప్రతి రంగంలోనూ గిరిజన బిడ్డలు ఉన్నత స్థాయిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం గర్వకారణమని అన్నారు పటాన్చెరు నియోజకవర్గంలోని వెలిమెల కొల్లూరు రాళ్లకత్వ ఐలాపూర్ కొత్తపల్లి తండాల పరిధిలో సొంత నిధులతో శ్రీ భవానీ మాత సేవాలాల్ మహారాజ్ దేవాలయాలను నిర్మించామని గుర్తు చేశారు జయంతులు వర్ధంతుల సమయాల్లోనే మహనీయుల సేవలను గుర్తించుకోవడం కాకుండా నిరంతరం వారి నుండి స్ఫూర్తి పొంది ముందుకు కొనసాగాలని సూచించారు భగవంతుడు ఇచ్చిన గొప్ప వరం మానవజన్మ అని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆ జన్మకు పరిపూర్ణత లభిస్తుందన్నారు ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం ప్రారంభమైందని గుర్తు చేశారు ఆయా పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి ఉత్సవ సమితి ప్రతినిధులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ముత్తమ్మ సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు బంజారా సంక్షేమ సంఘం బంజారా ఉద్యోగ సంఘం ప్రతినిధులు సీనియర్ నాయకులు కార్యకర్తలు యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# వసతి గృహంలో ఆరోగ్య శిబిరం

ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి బాల్కొండ



బాల్కొండ మండలం పోచంపాడు గురుకుల వసతి గృహంలో శనివారము వైద్యాధికారి మధుల రాకేష్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. 623 మంది విద్యార్థుల్లో 16 మంది అనారోగ్య విద్యార్థులను గుర్తించి వారికి చికిత్స కోసం మందులు అందజేశారు. విద్యార్థులకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వంటగది, స్టోర్, వసతి గదులు మరియు మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సురేందర్, వైద్య సిబ్బంది మురళి, ఎంఎల్ హెచ్పి మనీషా, ఏఎన్ఎం ఎస్తర్, ఆశా కార్యకర్తలు రజిత, అరుణ పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
22 ఆదివారం, ఫిబ్రవరి 2026
5
www.prajaveekshanam.in

# ఆదిలాబాద్ రిమ్స్ ఎస్.ఎన్.సి.యు విభాగానికి జాతీయ స్థాయి గుర్తింపు.

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ప్రజా వీక్షణం న్యూస్ ఆదిలాబాద్ :




పుదుచ్చేరిలోని ప్రతిష్టాత్మక జిప్మర్ సంస్థ నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని ఎస్.ఎన్.సి.యు విభాగం ప్రథమ బహుమతి తో పాటు 5 వేల రూపాయల రివార్డు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ రాజర్షిషా హర్షం వ్యక్తం చేశారు.ఇన్ఫెక్షన్ కంట్రోల్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రాజెక్టులో భాగంగా రిమ్స్ బృందం ప్రదర్శించిన ప్రతిభకు ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ పర్యవేక్షణలో,హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ టీం సభ్యురాలు డాక్టర్ పద్మవల్లి,సిమ్మి కుమారి,డాక్టర్లు తంగాయి నాథన్,అనంత్ రావు,ఎస్.ఎన్.సి.యు బృందం సమష్టిగా కృషి చేసి శిశు ఆరోగ్య విభాగంలో ఇన్ఫెక్షన్ల రేటును గణనీయంగా తగ్గించడంలో అద్భుతమైన ఫలితాలను సాధించారని కొనియాడారు.ఈ వర్క్‌షాప్‌లో ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ సీంనీ కుమారి సమర్పించిన పోస్టర్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుని మొదటి బహుమతికి ఎంపికైందని ఆయన తెలిపారు.ఇదే స్ఫూర్తితో జిల్లాలో వైద్య సేవలను మరింత మెరుగుపరిచి,సామాన్యులకు నాణ్యమైన చికిత్స అందించాలని రిమ్స్ బృందాన్ని కలెక్టర్ అభినందించారు.

# నిర్మల్‌లో నూతనంగా ఎన్నికైన 15 మంది ముస్లిం కౌన్సిలర్లకు ఘన సన్మాన సభ

## ప్రజాసేవలో నిష్ఠ, బాధ్యతతో పని చేయాలని నిర్మల్ ఖాజీ పిలుపు



ప్రజా వీక్షణం న్యూస్, నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 21.

నిర్మల్ పట్టణంలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన 15 మంది ముస్లిం కౌన్సిలర్లకు నిర్మల్ ఖాజీ, ఖాజీ అబ్దుల్ వాజిద్ ఖురేషీ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించడం ద్వారా నూతన ప్రజా ప్రతినిధులకు గౌరవం తెలియజేశారు.ఈ సందర్భంగా ఉప ఖాజీ మౌలానా అబ్దుల్ అలీమ్ ఖాస్మీ, నిర్మల్ ఖాజీ తరపున మరియు తన తరపున కౌన్సిలర్లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తన సంక్షిప్తమైన కానీ ప్రభావవంతమైన ప్రసంగంలో, ప్రజాసేవ అనే మహోన్నత మార్గాన్ని వారు ఎంచుకున్నారని పేర్కొంటూ, మానవ సేవ ద్వారా దేవుని ప్రసన్నతను పొందవచ్చని గుర్తు చేశారు.తమ తమ వార్డులలో పౌర సమస్యలను పరిష్కరించడంలో నిష్ఠ, బాధ్యత, అంకితభావంతో పనిచేయాలని ఆయన కోరారు. "మీరు నిజాయితీతో, కట్టుబాటుతో ప్రజలకు సేవ చేస్తే గౌరవం, గుర్తింపు మాత్రమే కాకుండా అల్లాహ్ ప్రసన్నతను కూడా పొందుతారు. అది ప్రతి విశ్వాసి జీవితంలోని పరమ లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. చివరగా, వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని హృదయపూర్వక ప్రార్థనలు, శుభాకాంక్షలు తెలిపారు.తరువాత సీనియర్ పౌరులు మరియు నిర్మల్ ఖాజీ అబ్దుల్ వాజిద్ ఖురేషీ వ్యక్తిగతంగా మహ్మద్ ముజాహిద్ అలీ, తౌహీదుద్దీన్ రఫ్ఫు, ఇమ్రానుల్లా, షేక్ సల్మాన్, జకీఉద్దీన్, రాహీల్ హమ్జా, షేక్ తాహిర్ పటేల్, రఫీ (గాజుల్పేట్), షేక్ జకీర్, షాకిర్, రఫీ (మదీనా కాలనీ), ఇర్ఫాన్, స్థానిక కాంగ్రెస్ కార్యకర్త ఖిజర్, అర్షద్, అల్మాస్‌లను అభినందించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా అతిథులకు మిఠాయిలు పంచి వేడుకను ఆనందంగా ముగించారు.ఈ కార్యక్రమానికి నిర్మల్ ఖాజీ వారసుడు ఖాజీ అబ్దుల్ బారి ఖురేషీ, షేక్ సయీద్, ఫిరోజ్ ఖాన్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.ఈ సభ నిర్మల్‌లో ఐక్యత, ప్రోత్సాహం, మరియు బాధ్యతాయుతమైన ప్రజా నాయకత్వం కోసం సమిష్టి ఆశలను ప్రతిబింబించింది.

# రంజాన్ మాసపు సహర్,ఇఫ్తార్ సమయ పోస్టర్ లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ప్రజా వీక్షణం న్యూస్ ఆదిలాబాద్ :

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ముద్రించిన 'నిజాముల్ ఔకాత్' (సహర్,ఇఫ్తార్ సమయ పట్టిక) కార్డులు,పోస్టర్లను శనివారం ఆదిలాబాద్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అబ్దుల్ కలీం,ఇతర శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రంజాన్ నేపథ్యంలో రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనల అమలుకు ప్రజలు సహకరించాలి: పట్టణ సీఐ నైలు

ప్రజా వీక్షణం న్యూస్, నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 21.

రంజాన్ నేపథ్యంలో పట్టణంలోని గుల్జార్ మార్కెట్ , ఓల్డ్ బస్టాండ్ లోని జామా మసీదు ప్రాంతంలో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయబడతాయని పట్టణ సీఐ నైలు తెలిపారు. పలువురు స్థానిక కౌన్సిలర్ల పలువురు మత పెద్దల అభ్యర్థన మేరకు ఆ ప్రాంతాలను సందర్శించారు. రద్దీ నియంత్రణకు బారీ కేడ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రార్థనకు వచ్చే ముస్లిం సోదరులకు ఇబ్బంది లేకుండా సాయంత్రం 5-7 మధ్య మసీదు ఎదుట నుంచి వాహన రాకపోకలు నిషేధించబడ్తాయన్నారు. ప్రజలంతా సహకరించాలని కోరారు.



# ఐమాక్స్ లైట్లను ప్రారంభించిన బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి

ప్రజా వీక్షణం న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

అమరచింత మండల పరిధి చంద్ర ఘడ్ గ్రామంలో శనివారం బిజెపి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి తన సొంత నిధులతో ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్యక్రమమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే నా ఏకైక లక్ష్యమని అన్నారు. నేను సంపాదించే సంపదను సామాజిక సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయడం నాకు ఎంత తృప్తినిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమం లో బిజెపి పార్టీ రూరల్ అధ్యక్షుడు, కిష్టం పల్లి గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షురాలు డాక్టర్ మంగ లావణ్య మండల ప్రధాన కార్యదర్శి సురేందర్, గ్రామ అధ్యక్షుడు గడ్డల శ్రీకాంత్, ఉపసర్పంచ్ కుమ్మరి నరసింహ, బండమీది రాము, బండ మిది రవి, పసుల శీను, ఆనంద్,బొంచని వెంకటన్న, రవి, ప్రశాంత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.




# పిఎం ఉజ్వల యోజన పథకం పేద కుటుంబాలకు ప్రయోజనం

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్



దారిద్ర దిగువన ఉన్న కుటుంబాలకు ఏ రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకానికి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని శనివారం సిరిసిల్ల నియోజకవర్గ బిజెపి కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పేద కుటుంబాలకు, ముఖ్యంగా మహిళలకు ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు అందించే కేంద్ర ప్రభుత్వ పథకం. మే 1, 2016న ప్రారంభమైన ఈ పథకం, మహిళల ఆరోగ్యాన్ని కాపాడటానికి మరియు పొగరహిత వంటగదిని ప్రోత్సహించడానికి ఉద్దేశించబడిందని, లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్ తోపాటు మొదటి రిఫిల్ ఉచితంగా అందుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికి 10.54 కోట్ల మంది లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేసిందని పేర్కొన్నారు.

# భద్రాద్రి ఫౌండేషన్ కున్సీ పాఠశాలకు చేయూత

## పాఠశాలకు 75022/-రూపాయలు అందించిన దాత రామకృష్ణ...

ప్రజా వీక్షణం న్యూస్ కృష్ణ... నారాయణపేట జిల్లా

భద్రాద్రి ఫౌండేషన్ తరపున తమ తల్లిదండ్రుల చేతుల మీదుగా కున్సి ఉన్నత పాఠశాలకు 75,022/-రూపాయలను విరాళంగా అందిస్తున్నట్లు ఉపాధ్యాయుడు శ్రీ రామకృష్ణ తెలిపారు.శనివారం మండలంలోని గురుజాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 65 ప్లేట్లు 65 గ్లాసులు అలాగే కున్సి ఉన్నత పాఠశాల విద్యార్థులకు చేయూతగా ఉండాలని భావించి 75,022/-రూపాయలు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంతోషి కు విరాళంగా అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు సంతోషి మాట్లాడుతూ దాతృత్వ గుణం కలిగిన రామకృష్ణ గారి సేవాభావాన్ని మెచ్చుకుంటూ, ఈ విరాళాన్ని విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సమర్థవంతంగా వినియోగిస్తామని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో దాత శ్రీ రామకృష్ణ వారి తల్లిదండ్రులు,గురుజాల సర్పంచ్ కమలమ్మ, ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, కుర్షిద్ బేగం, అంగన్వాడీ టీచర్ లక్ష్మి,ధన్వాడ ఉన్నత పాఠశాల అశోక్ కుమార్,ఉపాధ్యాయులు నరేందర్,ఖాశీంఅలి, నరసింహులు, సత్యనారాయణ రెడ్డి, సౌమ్య స్వాతి,గీత, నాగేష్,రాధిక, సుదర్శన్,హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల తరపున భద్రాద్రి ఫౌండేషన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



# మండలిలో స్వామివారికి వైసిపి అపచారం

## ఇది ముమ్మాటికి దైవద్రోహమే

## టిటిడి సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి ఆగ్రహం

తిరుపతి,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

శాసనమండలిలో వైసీపీ నేతలు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి పట్ల చూపిన వ్యవహారాన్ని టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఇది దైవద్రోహం..అపచారం' అని మండిపడ్డారు. శాసనమండలిలో వైసీపీ నేతలు చెప్పులు, బూట్లు వేసుకుని వేంకటేశ్వర స్వామి ఫోటోలు పట్టుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి కళ్లల్లో ఆనందం చూడాలని, ఆయనను సంతృప్తి పరిచేందుకు నేతలు వ్యవహరించిన తీరు దురదృష్టకరమని మండిపడ్డారు. 'మీరు వేంకటేశ్వర స్వామి భక్తులా? యేసు భక్తులా?' సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్వామి భక్తులైతే ఈ విధంగా ప్రవర్తించరని ఆయన అన్నారు.వైసీపీ నేతలకు బుద్ధి లేదని భానుప్రకాశ్ రెడ్డి విమర్శించారు. 2019 నుంచి 2024 వరకు టీటీడీని టా÷-గ్గ÷ట్ చేసి దాడులు చేశారని గుర్తు చేశారు. వైసీపీ నేతలు చెప్పులు వేసుకొని వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని తీసుకువెళ్లిన సంఘటనపై న్యాయ నిపుణులతో మాట్లాడానని, స్వామివారి పట్ల అపచారం చేసిన వారికి లీగల్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. హిందువులను గౌరవించే వ్యక్తి అయితే జగన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచే దీనికి డైరెక్షన్ జరిగిందని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా హిందూ ధర్మాన్ని, దేవాలయాలను అవహేళన చేసే విధంగా వ్యవహరించారని ఆయన మండిపడ్డారు. శాసనమండలి పెద్దల సభను వైసీపీ నేతలు 'రాక్షస సభ'గా మార్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ ధర్మంపై విష ప్రచారం చేస్తున్నారన్గి÷ర్ అయ్యారు. నిన్నటి సంఘటనపై జగన్‌మోహన్ రెడ్డి సహా అందరూ క్షమాపణ చెప్పాలని, అలిపిరికి వచ్చి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవిత్రమైన ఏడుకొండలపై కొలువైన స్వామితో ఆటలాడుకోవడం మంచిది కాదని... గతంలో విమర్శించిన వారు మాడి మసైపోయారని హెచ్చరించారు. వేంకటేశ్వర స్వామి ఆగ్రహం వల్లే వైసీపీ 11 స్థానాలకు పరిమితమయ్యారని భానుప్రకాశ్ వ్యాఖ్యలు చేశారు.అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ అని.. వారిలో మొదటి స్థానంలో భూమన కరుణాకర్ రెడ్డి ఉన్నారని భాను ప్రకాశ్ ఎద్దేవా చేశారు. కరుణాకర్ రెడ్డి సిట్ విషయంలో మాట్లాడిన దానిలో వాస్తవం లేదని అన్నారు. వైవీ సుబ్బారెడ్డి నెయ్యి కొనుగోలులో మార్పులు చేసినప్పుడు భూమన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. వైసీపీ నేతలు హిందూ ద్రోహులుగా మిగిలిపోతారని అన్నారు.

# పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహాఅభియాన్

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో 'పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాఅభియాన్ -2026'జిల్లా స్థాయి కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు బండారు రాధిక, జిల్లా ఇన్చార్జి గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడారు. ఏకాత్మ మానవవాదం, అంత్యోదయ సిద్ధాంతాలను ప్రేరణగా తీసుకుని, ప్రతి కార్యకర్తలో జాతీయ భావన, సిద్ధాంత నిబద్ధత, సేవాభావాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యశాల నిర్వహించబడిందని అన్నారు. కార్యక్రమంలో బిజెపి శ్రేణులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, లింగంపల్లి శంకర్, ఆడెపు రవీందర్, పొన్నాల తిరుపతి రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, శీలం రాజు, మల్లారపు సంతోష్ రెడ్డి, బర్కం లక్ష్మి, నవీన్ యాదవ్, రాగుల రాజిరెడ్డి, పల్లం అన్నపూర్ణ, దుమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక చైతన్యం, శాంతి, ధర్మ పరిరక్షణకు
# నిలయాలు దేవాలయాలు
## : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ప్రజా వీక్షణం

ఈరోజు జిహెచ్ఎంసి కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొంపల్లి చౌరస్తాలో భైరవ వీరాంజనేయ స్వామి దేవాలయ పునఃనిర్మాణ మరియు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ఆధ్యాత్మిక చైతన్యం, శాంతి, ధర్మ పరిరక్షణకు నిలయాలు దేవాలయాలు అని అన్నారు. ఆలయ పునఃనిర్మాణం, అభివృద్ధిలో తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, సీనియర్ నాయకులు శిరీష ప్రవీణ్ రావు, చింతల దేవేందర్ యాదవ్, లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్ బస్తి లో. పంచముఖ హనుమాన్ విగ్ర ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న తాజా మాజీ కార్పొరేటర్....

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ప్రజా వీక్షణం

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రింగ్ బస్తి. అభయాంజనేయ స్వామి ఆలయంలో పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి స్థానిక మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొలుకుల జగన్ మాట్లాడుతూ విగ్ర ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. లిఈ కార్యక్రమంలో కొలుకుల జైహింద్. పాపిరెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాపయ్య గౌడ్. సింగిరెడ్డి మల్లారెడ్డి. వెంకటేష్. యాదగిరి. శ్రావణ్. సుభాష్ గౌడ్. శ్రీనివాస్. రాఘవేందర్. సునీల్ రెడ్డి. రాజు. .. భక్తులు తదితరులు పాల్గొన్నారు.







## భక్తుల ముంగిటకే భద్రాద్రి రాములోరి
# కల్యాణ తలంబ్రాలు...
## టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు రూ.151 చెల్లిస్తే హోం డెలివరీ

ప్రజా వీక్షణం, హైదరాబాద్:

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తుల ఇంటికే చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సిద్ధమైంది. గత మూడేళ్లుగా ఈ విశిష్ట సేవలను అందిస్తున్న సంస్థ, ఈ ఏడాది దేవాదాయ శాఖ సహకారంతో తలంబ్రాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. శనివారం హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో ఇందుకు సంబంధించిన గోడ పత్రికను సంస్థ వీసీ, ఎండీ వై.నాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటి బియ్యం గింజలను గోటితో ఒలిచి సిద్ధం చేసిన ఈ అత్యంత విశిష్టమైన తలంబ్రాలను భక్తుల చెంతకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి 23వ తేదీ నుంచి బుకింగ్స్ ప్రారంభమవుతాయనీ. ఒక్కో ప్యాకెట్‌కు రూ.151 చెల్లించాల్సి ఉంటుందనీ, భక్తులు టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్ల వద్ద లేదా ఆన్‌లైన్‌లో ఝఝ్.స్త్రుఖీఎశ్రీశీస్త్రఱం-ుఅఎం.ఝశీ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. మార్చి 27న జరిగే కల్యాణోత్సవం అనంతరం టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా భక్తుల ఇళ్లకు హోం డెలివరీ చేయబడుతుంది. 2022లో 89 వేల మంది భక్తులు ఈ సేవను వినియోగించుకోగా, గత మూడేళ్లలో లక్షలాది మందికి తలంబ్రాలను అందజేశామని ఎండీ వెల్లడించారు. భద్రాద్రి




వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 040-23450033 లేదా 040-69440069 నంబర్లను సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో సీటీఎం శ్రీధర్, ఏటీఎం రాజన్, భాను తదితరులు పాల్గొన్నారు..

## ప్రజలకు చేరువ అయ్యే ప్రయత్నంలో
# మరో ముందడుగు
## - జీడిమెట్ల పోలీసు అధికారులు

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ప్రజా వీక్షణం

మానసిక సమస్యతో ఇబ్బంది పడుతున్న వ్యక్తిని వారి తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో చేర్చడం జరిగింది. మానసిక సమస్యలతో కాలనీవాసుల్ని తల్లిదండ్రులని ఇబ్బంది పెడుతున్న 26 సంవత్సరాలు యువకుడ్ని వారి తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు జీడిమెట్ల పోలీసులు అతనికి కౌన్సిలింగ్ చేసి పోలీసు వాహనంలో తీసుకెళ్లి ఎర్రగడ్డలోని వైద్య ఆసుపత్రిలో అడ్మిషన్ ఇవ్వడం ఇప్పించడంతోపాటు సరైన మెరుగైన చికిత్స అందించి వీలైనంత తొందరగా ఆ యువకుడ్ని మామూలు స్థితికి తీసుకురావాల్సిందిగా డాక్టర్ల బృందాన్ని కోరడం జరిగింది. పోలీస్ కేవలం కేసుల నమోదు విచారణ మాత్రమే కాకుండా సమాజంలో ఉన్న సమస్యల తీర్చడంలో తమ పాత్ర పోషించాలని సిపి రమేష్ రెడ్డి ఐపీఎస్ గారి ఉత్తర్వుల మేరకు ఇలాంటి వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోంది.



## 65 కిలోల బక్సింగ్ పోటీలో బంగారు మెడల్ సాధించిన.. కానిస్టేబుల్ పి. ప్రశాంత్....

ప్రజా వీక్షణం హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ శాఖలో పనిచేస్తున్న క్రీడాకారుల బేగంపేట్ నందున జరిగిన బాక్సింగ్ 65 కేజీల బరువుతో పోటీలో దాదాపుగా 20 మందితో జరిగిన పోటీలో గోల్డ్ మెడల్ సాధించిన జూ ప్రశాంత్ (AR [illegible]) సిల్వర్ మెడల్ సాధించిన జూ ప్రభు (౦+ ౫ా) వీరికి పోలీస్ శాఖ వారు గచ్చిబౌలి స్టేడియంలో వారికి మెడల్ అందజేశారు ఉన్నత అధికారులు ప్రశాంత్ ప్రభు ఇద్దరూ అన్నదమ్ములు వీరు ఎన్నో పథకాలు సాధించడం జరిగింది. మీరు ముషీరాబాద్ నియోజకవర్గం లో గాంధీనగర్ డివిజన్ జవాన్ నగర్ తండ్రి పేరు బాబ్జి ( స్టీవెన్) తండ్రిగారు ఉన్నత అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు




## తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ పతనం కాకుండా చూడాలి....
### టీ టీ డి పి జాతీయ ప్రచార కార్యదర్శి... జె. దశరథ్

ప్రజా వీక్షణం హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ రాష్ట్ర భారీగా పతనం దిశగా రాష్ట్ర రెవిన్యూ అధికారులు 2025..26...అంచనా ప్రకారం 2.39.లక్షల కోట్లు జనవరి నాటికి 1.35.కోట్లు అప్పుల ఊబిలోకి కూరుకు పోయిన రాష్ట్ర గా తెలుగు రాష్ట తెలంగాణ రాష్ట్రం ఉందనడానికి కంట్రోల్ ఆడిట్ జనరల్ కాగ్ తన జనవరినివేదికలో ప్రకటించిన విషయాని ఈసందర్భంగా తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జె దశరథ్ కాంగ్రెస్ ప్రభుత్వం గోరంగా విఫలం చెందిందని ఈసందర్భంగా దశరథ్ స్పష్టం చేశారు కేవలం ప్రభుత్వం రెవెన్యూ శాఖ ఇస్తున్న లేకపత్రాలు అయోమయం గురి చేస్తున్నట్లు తెలిపారు కంట్రోల్ ఆడిట్ జనరల్ అధికారులు అంచనా ప్రకారం తెలుగు రాష్టం బారి రెవెన్యూ లోటుతో ఆదిశగా ఉందనడానికి ఉదాహరణ ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఇవ్వవలసిన డీఏ గత నెల లో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఉద్యోగులకు డి ఏ లు ప్రకటించి 6.నెలకు పైగా అవుతున్న ప్రభుత్వం ఉద్యోగులకు ముఖ్యమంత్రి . ఇస్తామని చెపిన్న డి ఏ ఇంకా విడుదల కాలేదండానికి ఉదాహరణ అట్లాగేప్రభుత్వం పెన్షనర్ కూడా పెన్షన్ అందక అవస్థ పడుతున్నారని ఈసందర్భంగా దశరథ్ స్పష్టం ప్రభుత్వ యంత్రాగం ఇకనైనా మేల్కొని ఏ విధంగా రెవెన్యూ లేకుండా అధికారులు ఒక అంచనాలకు మించిన ఆడంబరాలకు పోకుండా ప్రభుత్వ ట్రెజరీ అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి గారు ప్రభుత్వ యంత్రాగం ఇకనైనా ఒకావగహనకు వచ్చి కాగ్ ఇచ్చిన వాటిని కులాష్కంగా తీసుకొని రెవెన్యూ లోటు లేకుండా కేంద్ర సహాయం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్బీఐ కి అట్లాగే కేంద్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ తో మాట్లాడాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక లోటు లేకుండా ప్రభుత్వం చర్యలకు పూనుకోవాలని ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి డిమాండ్ చేశారు.... ప్రచురణ కోసం మీ జె దశరథ్....తెలంగాణ రెవెన్యూ లోటు.లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం... జె దశరథ్ తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రచార

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు...
### జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఉమా గౌరి- జిల్లా స్థాయి సలహా సంఘం సమావేశం ...
### స్కానింగ్ సెంటర్ల పనితీరుపై ఆకస్మిక తనిఖీలకు ఆదేశం




ప్రజా వీక్షణం, మేడ్చల్ జిల్లా ప్రతినిధి:

జిల్లాలో పి.సి , పి.ఎన్.డి.టి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమా గౌరి ఆదేశించారు. శనివారం జిల్లా ఆరోగ్య అధికారి కార్యాలయంలో 'జిల్లా స్థాయి సలహా సంఘం' సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డా. ఉమా గౌరి మాట్లాడుతూ.. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రదర్శించాలని సూచించారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంచడం, కొత్తగా స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులు పాత, వాటి పునరుద్ధరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పరిశీలించడం. ప్రతి సెంటర్లో పి.సి , పి.ఎన్.డి.టి చట్టం అమలు తీరుపై అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలనీ, స్కానింగ్ చేసే ప్రతి గర్భిణీకి సంబంధించిన ఫార్మ్-ఎఫ్ రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గీత, జెనెటిస్ట్ డాక్టర్ స్వర్ణలత, ఎన్జిఒ ప్రతినిధి హైమావతి, డిప్యూటీ డెమో వసంత తదితరులు పాల్గొన్నారు. చట్టం అమలులో ఎదురవుతున్న సవాళ్లు , క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

## దోమల నివారణ చర్యలు తీసుకోండి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి
### : బిజెపి ప్రగతి నగర్ అధ్యక్షుడు
### నరేంద్ర చౌదరి

ప్రజా వీక్షణం:ప్రగతి నగర్

నిజాంపేట సర్కిల్ ప్రగతి నగర్ డివిజన్లో ప్రజలు తీవ్రమైన దోమల వలన అనారోగ్యం పాలవుతున్నారని భారతీయ జనతా పార్టీ ప్రగతి నగర్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో కాకతీయ హిల్స్ శివాజీ సర్కిల్ వద్ద వినూత్న రీతిలో దోమల బ్యాట్లు, మస్కిటో కాయిల్స్ తో వినూత్న రీతిలో నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక అధ్యక్షులు నరేంద్ర చౌదరి మాట్లాడుతూ డ్రైనేజీలు పొంగి రోడ్లమీద నిలిచి ఉండటం కాలువల శుభ్రతలో చేయడంలో జాప్యం అదేవిధంగా చెరువుల మీద గుర్రపు డెక్క పేరుకుపోవడం ఫాగింగ్ సరైన రీతిలో చేయకపోవడం బ్లీచింగ్ లాంటి నివారణ చర్యలు తీసుకోకపోవడం అధికారుల యొక్క నిర్లక్ష్య వైఖరి వల్లనే ఈరోజు తీవ్రస్థాయిలో దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తక్షణమే నివారణ చర్యలు తీసుకోకపోతే కార్పొరేషన్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తు నిరసన తెలియజేస్తామని తెలియజేశారు.

ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS 7

22 ఆదివారం, ఫిబ్రవరి 2026

www.prajaveekshanam.in

# ప్రధాని మోదీ రాజీపడ్డారు

## 18 రోజు వేచి ఉంటే ఏకపక్ష ఒప్పందం

## ట్రేడ్ డీల్ ఒప్పందంపై కాంగ్రెస్ విమర్శలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం):**

అమెరికా విధించిన సుంకాలను సుప్రీంకోర్టు రద్దు చేసిన తర్వాత భారత్?తో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికాతో ఏకపక్ష, భారత వ్యతిరేక వాణిజ్య ఒప్పందం చేసేందుకు కేంద్రం తొందరపడిందని ఆరోపించింది. తొందరపాటు అనేది దెయ్యం పని అని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేడా విమర్శలు గుప్పించారు. ఫిబ్రవరి 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, వాషింగ్టన్‌కు అర్ధరాత్రి ఫోన్ కాల్ ఎందుకు చేశారని నిలదీశారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. 'అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ గ్లోబల్ టారిఫ్‌లను రద్దు చేసింది. భారత్ మరో 18 రోజులు వేచి చూసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఫిబ్రవరి 2న వాషింగ్టన్‌కు అర్ధరాత్రి కాల్ ఎందుకు? సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు ఎందుకు ఆగలేదు? జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణే ప్రకటనలే కారణమా? జెఫ్రీ ఎఫ్?స్టీన్ ఫైళ్ల ప్రభావమా? గౌతమ్ అదానీకి సంబంధించిన అమెరికా క్రిమినల్ కేసా? లేక ఇవన్నీ కారణాలా? ఈ రోజు కాంగ్రెస్ వాదన సత్యమైంది. ప్రధాని నరేంద్ర మోదీ రాజీ పడ్డారు' అని పవన్ ఖేడా ఆరోపించారు. అమెరికాతో కుదిరిన ఏకపక్ష వాణిజ్య ఒప్పందాన్ని మోదీ ప్రభుత్వం పునఃసమీక్షించాలని కాంగ్రెస్ నేత రణదీప్? సుర్జేవాల్ అన్నారు. అమెరికా కొత్తగా ప్రతిపాదించిన సుంకాల స్థిరత్వం, భారత్‌పై వాటి వర్తింపును ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. '1977లో అమల్లోకి వచ్చిన ఐఈఈపీఏ కింద అధ్యక్షుడికి టారిఫ్‌లు విధించే అధికారం లేదని అమెరికా సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 122, 1962 ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్ సెక్షన్ 232, 1974 ట్రేడ్ యాక్ట్ సెక్షన్ 301 కింద ట్రంప్ ప్రకటించిన కొత్త టారిఫ్‌లు భారత్‌కు వర్తించవని కనిపిస్తున్నాయి. ఇప్పుడు ప్రశ్న ఏంటంటే, ఈ సుంకాలు భారత్‌పై చట్టబద్ధంగా అమలవుతాయా? అమెరికా--భారత్ వాణిజ్య ఒప్పందం నిలబడుతుందా? రైతులు, చిన్న, మధ్యతరహా వ్యాపారులు, ఇంధన, డేటా నిపుణులు, ఆర్థికవేత్తలు వ్యతిరేకిస్తున్న ఈ ఒప్పందం నుంచి బయటకు రావడానికి మోదీ ప్రభుత్వం ధైర్యం చేస్తుందా?' అని సుర్జేవాలా ప్రశ్నించారు. సెక్షన్ 122 (ట్రేడ్ యాక్ట్, 1974) ప్రకారం 150 రోజులపాటు మాత్రమే 10శాతం టారిఫ్ విధించవచ్చని సుర్జేవాలా తెలిపారు. తరువాత అమెరికా కాంగ్రెస్ ఆమోదం అవసరమని, ఇది తాత్కాలిక చర్య మాత్రమే అని అన్నారు. ఇక సెక్షన్ 232 (ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్, 1962) -- జాతీయ భద్రతా కారణాలతో మాత్రమే టారిఫ్ విధించాలని పేర్కొన్నారు. 270 రోజుల్లో అమెరికా వాణిజ్య శాఖ సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని చెప్పారు. భారత ఎగుమతులు జాతీయ భద్రతకు ముప్పు కాదని వివరించారు. అలాగే సెక్షన్ 301 (ట్రేడ్ యాక్ట్, 1974) -- సంబంధిత దేశం అన్యాయ వాణిజ్య పద్ధతులు అనుసరించిందని దర్యాప్తు ద్వారా నిరూపించాలని చెప్పారు. భారత్‌పై అలాంటి దర్యాప్తు జరగలేదని ఆయన వివరించారు. ఇప్పుడు జాతీయ ప్రయోజనాలను రక్షించడానికి ప్రభుత్వం సిద్ధమా? అని సుర్జేవాలా ప్రశ్నించారు. ట్రంప్ సుంకాలను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ప్రశంసించారు. ట్రంప్ మొత్తం టారిఫ్ వ్యూహాన్ని కొట్టివేసిన అమెరికా సుప్రీంకోర్టుకు అభినందనలు తెలిపారు. కోర్టు భావజాల పరమైన నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుంటే 6-3 తీర్పు అద్భుతమైన, స్పష్టమైన నిర్ణయని పేర్కొన్నారు. అంతేకాకుండా. అమెరికా చెక్స్ అండ్ బాలెన్సెస్ వ్యవస్థ ఇంకా పనిచేస్తుందని చురకలేశారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు.ఇదిలా ఉండగా, అమెరికా 10 శాతం గ్లోబల్ టారిఫ్‌ను అమలు చేసింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రకారం భారత్ కూడా ఈ టారిఫ్ చెల్లించాల్సి ఉంటుందని వైట్?హౌస్ స్పష్టం చేసింది. ఇక సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రపంచ వాణిజ్యం, వ్యాపార సంస్థలు, వినియోగదారులు, ద్రవ్యోల్బణ ధోరణులు, గృహ ఆర్థిక పరిస్థితులపై విస్తృత ప్రభావం చూపే అవకాశముంది.

# ప్రధాని నివాసం కోసం మురికివాడల ఖాళీ

### ఇప్పటికే నోటీసులు ఇచ్చిన అధికారులు

### దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు జారీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

దేశ రాజధాని న్యూఢిల్లీలో పరధాని నూతన నివాస నిర్మాణం.. దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో మురికి వాడల్లో నివాసముంటున్న కుటుంబాలపై పడింది. అక్కడి నుంచి ఖాళీ చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ వారిని ఆదేశించింది. ఈ మేరకు వారికి నోటీసులు పంపింది. అక్కడి నుంచి ఖాళీ చేయకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చ రించింది. దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు అందాయని తెలుస్తున్నది. అయితే కచ్చితమైన గడువు తేదీని పేర్కొనకపోవడం, పునరావాసంపై ఎలాంటి స్పష్టతా లేకపోవడంతో అక్కడి స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధాని నూతన నివాసం నిర్మాణం నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నోటీసులు వచ్చినట్టు అంతా భావిస్తున్నారు. రేస్‌కోర్స్ రోడ్ వెంట ఉన్న భాయిరామ్ క్యాంప్, మస్జీద్ క్యాంప్, డిఐడి క్యాంప్ నివాసితులకు ఈ నోటీసులు అందినట్టు సమాచారం. నోటీసులో ఆ భూమిని ప్రభుత్వానికి చెందినదనీ, ఇకపై అక్కడ నివసించడం అనధికారికంగా పరిగణిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆదేశాలను పాటించకపోతే చట్ట ప్రకారం అక్కడి నుంచి తొలగింపు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు.ఈ నోటీసుతో అక్కడి స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చాలా మంది నిరుపేదల అక్కడ నివసిస్తూ సమీప ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. ఖాళీ చేయాల్సిన గడువు, పునరావాసం, ప్రత్యామ్నాయాలపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదని వారు అంటున్నారు. కాగా వారు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులను సంప్రదించి.. పునరావాసంపై స్పష్టత కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా ఈ చర్యలు రాజధాని సెంట్రల్ జోన్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే విస్తృత ప్రణాళికలో భాగమని అధికారులు తెలిపారు.

# ఢిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

### ఆలయాలే లక్ష్యంగా దాడికి స్కెచ్

### నిఘా వర్గాల హెచ్చరికలు జారీ

### ఇతర నగరాల్లోనూ పేలుళ్లకు కుట్ర

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం):**

దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయిబా(రామ) కుట్ర పన్నింది. ఈ మేరకు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో ఢిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్ ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా ఎల్?ఈటీ దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. చాందినీ చౌక్ ప్రాంతంలోని ఒక దేవాలయంపై ఐఈడీతో దాడి చేసేందుకు ఉగ్రవాదులు వ్యూహం పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. కేవలం ఢిల్లీలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలు కూడా ఉగ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నవంబర్ 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 12 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనపై దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మరోసారి ఎర్రకోట పరిసర ప్రాంతాలపై ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు రావడం దేశ రాజధానిలో కలకలం రేపుతోంది.

# మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు!

### అంతర్జాతీయ పరిణామాలతో పైపైకి..

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం):**

దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ వారం మధ్యలో కాస్త తగ్గుముఖం పట్టిన పసిడి, శనివారం ఉదయం మరోసారి పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం (10 గ్రాములు) ధర రూ.1,57,380 వద్ద స్థిరపడింది. ఇక ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,44,260గా ఉంది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, శుక్రవారంతో పోలిస్తే 24 క్యారెట్ల బంగారంపై రూ.880, 22 క్యారెట్లపై రూ.800 మేర పెరిగింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,520 ఉండగా, ముంబైలో రూ.1,57,370, చెన్నైలో రూ.1,57,300గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలే బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, డాలర్ విలువలో మార్పులు, ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. ఈ కారణంగానే పసిడికి డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు వివరిస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల సాధారణ వినియోగదారులపై, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోలు చేసే వారిపై ప్రభావం చూపనుంది.

# మీరే నాకు జీతం ఇస్తున్నారు సార్..

### సుందర్ పిచాయ్‌తో

### యూట్యూబర్ సరదా ముచ్చట

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం):**

దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో ఓ యూట్యూబర్ కు సర్ ప్రైజ్ ఎదురైంది. ఏకంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ పక్కన కూచునే అవకాశం దక్కింది. తన సీటుకు రెండు సీట్ల అవతల ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన వ్యక్తి కూర్చోవడంతో ఆ యూట్యూబర్ సంతోషం మామూలుగా లేదు. తిన్నగా ఆయన వద్దకు వెళ్లి 'నమస్తే సార్.. మీరే నాకు నెలనెలా డబ్బులు ఇస్తున్నారు' అంటూ పలకరించాడు. దీనికి ఆశ్చర్యపోయిన సుందర్ పిచాయ్.. అదెలాగని ప్రశ్నించగా తానో యూట్యూబర్ నని, నెలనెలా యూట్యూబ్ నుంచి ఆదాయం పొందుతున్నానని చెప్పడంతో ఆయన కూడా నవ్వేశారు. అనంత్ లధా అనే యూట్యూబర్ కు ఎదురైందీ అనుభవం. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స వేదికగా పంచుకోవడంతో ఆ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చార్టర్డ్ అకౌంటెంట్ నుంచి యూట్యూబర్ గా మారిన అనంత్ లధా.. 'ఇన్వెస్ట్ ఆజ్ ఫర్ కల్' అనే ప్లాట్‌ఫారమ్ నడుపుతున్నారు. ఏఐ సదస్సులో సుందర్ పిచాయ్‌తో కలిసి దిగిన సెల్ఫీని షేర్ చేస్తూ తన 'ఫ్యాన్ బాయ్' మూమెంట్ గురించి ఎక్స్ లో పోస్ట్ చేశారు. సదస్సులో సుందర్ పిచాయ్ పక్కనే కూర్చునే అవకాశం రావడంతో అనంత్ ఆయనతో మాటలు కలిపానని చెప్పారు. ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు సుందర్ పిచాయ్ సింప్లిసిటీని మెచ్చుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. "బిజీ షెడ్యూల్ లోనూ సామాన్య వ్యక్తులతో ఆయన మాట్లాడే విధానం అద్భుతం" అని ఒకరు,

# ఎమ్మెల్యే జివి ఆసక్తికర వ్యాఖ్యల

### 50కోట్లు అనడానికి బదులు 50వేల కోట్లు అంటూ వ్యాఖ్య

### సరిదిద్ది నవ్వుకున్న చంద్రబాబు

**పల్నాడు,ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం):**

వినుకొండలో సీఎం చంద్రబాబు పర్యటనలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం బహిరంగ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రసంగిస్తూ.. వినుకొండలో పార్కు, స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం కోసం రూ.50 వేల కోట్లు నిధులు కేటాయించాలని అన్నారు. అది విన్న సీఎం చంద్రబాబు నవ్వులు చిందించారు. అనంతరం ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను సరిదిద్దుకొని రూ.50 కోట్లు కేటాయించాలని కోరారు. ఈ వ్యాఖ్యలతో అక్కడున్న టిడిపి వారు కూడా నవ్వులు చిందించారు.




# గడ్డి మందుతో ప్రాణాలు హరీ

### దానిని వెంటనే నిషేధించాలి

### మాజీ ఎంపి బి. వినోద్ డిమాండ్

**హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

మనుషుల ప్రాణాలను హరిస్తున్న పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందు వాడకుండా నిషేధం విధించాలని, దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఈ మందు తాగి పదుల సంఖ్యలో కరీంనగర్, వరంగల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరి మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందని అన్నారు. ఈ మందుకు విరుగుడు మందు లేకపోవడం వల్ల తాగిన వ్యక్తులు చనిపోతున్నారని పేర్కొన్నారు. పారాక్వాట్ డిక్లోరైడ్ వాడకాన్ని ఒడిశా ప్రభుత్వం ప్రతి ఆరు నెలల పాటు నిషేధిస్తూ వస్తోందని, ప్రపంచంలో 70 దేశాలు ఈ గడ్డి మందును నిషేదించాయని వెల్లడించారు. పారా క్విట్ డై క్లోరైడ్‌ను నిషేధించాలని సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి, సీఎస్ రామకృష్ణారావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరామ్ రెడ్డి,ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కిషన్‌కు లేఖ రాశారని వివరించారు.తెలుగు రాష్టాల్లో్ర పారా క్విట్ డై క్లోరైడ్ గడ్డి మందు తాగి ఎక్కువ మంది చనిపోతున్నారనికొందరు వైద్యులు కూడా వెల్లడించారు. ఈ గడ్డి మందు వాడకంపై గ్రామాల్లో తిరిగి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామని, దీనిని నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు. ఎండో సల్ఫన్ అనే మందును ఇండియాలో బ్యాన్ చేసినట్లుగానే పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందు త్రాగి బ్రతికేవాళ్లు సైతం సైడ్ ఎఫెక్ట్స్ తో చనిపోతున్నారని వివరించారు. పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందును వాడిన తర్వాత మిగిలిన మందును రైతులు దాచుకోవద్దని సూచించారు.

# పసి పిల్లలపై లైంగిక దాడులు

### 33 మంది బాలలకు

### నరకం చూపిన దంపతులు

### మరణశిక్ష విధించిన

### సిబిఐ కోర్టు

**లక్నో,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

అభంశుభం తెలియని పసి పిల్లలపై కొందరు మానవ మృగాలు లైంగిక వేధింపులకు పాల్పడ్డ కేసులో దంపతులకుమరణశిక్ష పడింది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారికి కోర్టులు సైతం కఠిన శిక్షలు విధిస్తున్నాయి. తాజాగా ఇలాంటి ఓ కేసు విషయంలో దంపతులకు మరణశిక్ష పడింది. పదేళ్లలో 33 మంది బాలురపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు, ఆ దృశ్యాలను చిత్రీకరించి విదేశాలకు పంపించిన ఈ నరరూప రాక్షస దంపతులకు సరైన శిక్షపడింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రామ్ భవాన్.. చిత్రకూట్ జిల్లాలో గతంలో నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో తన భార్య దుర్గావతితో కలిసి 2010-2020 మధ్య.. బందా, చిత్రకూట్ ప్రాంతాల్లో బాలురపై లైంగిక దాడులకు పాల్పడ్డాడు. వీరి దారుణాలకు బలైన వారిలో మూడేళ్ల వయసు చిన్నారులు కూడా ఉన్నారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్, బహుమతులు, తినుబండారాల పేరుతో పిల్లలను మభ్యపెట్టి ఇంటికి రప్పించి ఈ దారుణాలకు ఒడిగట్టారు. ఈ దంపతుల దారుణాలకు సంబంధించిన 2 లక్షల వీడియోలు, ఫొటోలను ఇంటర్నెట్ ద్వారా 47 దేశాలకు పంపించారు. నిందితులపై సీబీఐ 2020 అక్టోబరులో కేసు నమోదు చేసింది. మైనర్ బాధితుల పట్ల సీబీఐ దర్యాప్తు సున్నితంగానే కొనసాగింది. రామ్ భవాన్, అతడి భార్యపై 2021 ఫిబ్రవరిలో సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ దంపతుల నుంచి ప్రాణాలతో బయటపడిన పిల్లల్లో కొందరి ప్రైవేట్ భాగాలపై గాయాలు అయ్యాయని, వారిలో కొందరు ఏళ్ల తరబడి ఆసుపత్రులలో చికిత్స తీసుకోవాల్సి వచ్చిందని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఐదేళ్ల పాటు యూపీలోని పోక్సో కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. తాజాగా కోర్టు తుది తీర్పును వెల్లడించింది.------

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### తెలంగాణ మీడియా

### అకాడమి చైర్మన్ శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ మీడియా అకాడమి కట్టుబడి ఉందని చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారంనాడు తెలంగాణ మీడియా అకాడమిలోని కాన్ఫరెన్సు హాలులో 2వ పాలకమండలి సమావేశం చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోని 8 జిల్లాలకు చెందిన జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు, వివిధ అంశాలపై 7 వర్క్ షాప్ లు, 12 మంది సీనియర్ జర్నలిస్టులు చేసిన సేవలను రాబోయే తరాలకు తెలియపర్చాలనే ఉద్దేశ్యంతో వారి జీవితాలపై మోనోగ్రాఫ్స్ ముద్రించినట్లు ఆయన తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా విడతల వారీగా 120 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, 5 సంవత్సరాల కాల పరిమితితో నెలకు 3 వేల రూపాయల పెన్షన్ సదుపాయం కల్పించినట్లు ఆయన వివరించారు. అదే విధంగా అనారోగ్యం, ప్రమాదాలకు గురైన 19 మంది జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేశామన్నారు. అకాడమి భవన నిర్వహణలో భాగంగా 250 మంది సీటింగ్ కెపాసిటీ గల ఆడిటోరియం అ÷-దదెకు ఇవ్వడానికి సమావేశంలో చర్చించగా కమిటీ సభ్యులు తమ ఆమోదం తెలుపడం పట్ల కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వర్కింగ్ కౌన్సిల్ సభ్యులు మీడియా అకాడమి భవన నిర్వహణలో భాగంగా ఆడిటోరియం అద్దెకు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేస్తునే ఈ విధానం పూర్తిగా ఆన్ లైన్ విధానం ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా మీడియా అకాడమి వెబ్ సైట్లో ఆయా తేదీలు, సమయ పాలనని పొందుపర్చాలని సూచించారు. అప్పుడే పూర్తి పారదర్శకత చేకూరుతుందని వారు వెల్లడించారు. అందుకోసం ప్రభుత్వ ఆధీనంలోని రవీంద్రభారతి, జె.ఎన్.టి.యూ., సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయాకు సంబంధించిన విధి, విధానాలను అధ్యయనం చేసి అ÷-దదెకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని మీడియా అకాడమి కార్యదర్శికి సూచించారు.

# 1,100 ఫైల్స్ దగ్ధం ..

## డేటా రికవరీ చేయడం కష్టం

## కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ ఎంతో ముఖ్యం

## నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై ప్రత్యేక బృందం

ములుగు, ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం):

నాంపల్లి ఫోరెన్సిక్? సైన్స్? ల్యాబ్?లో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మొత్తం 1,100 ఫైల్స్? దగ్ధం అయినట్లు నాగ్?పూర్? నుంచి వచ్చిన స్పెషల్? టీం గుర్తించింది. ఈ దగ్ధమైన ఫైల్స్?లోని డేటా రికవరీ కోసం ఆ బృందం ఎంతో తీవ్రంగా ప్రయత్నించింది. తాజాగా ఈ ఫైల్స్?లోని డేటా రికవరీ చేయడం కష్టమని ప్రత్యేక బృందం తేల్చి చెప్పింది. ఈ ఫోరెన్సిక్? సైన్స్? ల్యాబ్?లో వివిధ కేసుల దర్యాప్తులో ఎఫ్?ఎస్ఎల్? కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో వెంట్రుకలు, ఎలక్ట్రానిక్? డివైజ్?ల విశ్లేషణ, రక్తం, వేలిముద్రలు, బుల్లెట్లు, లేదా డీఎన్?ఏ నమూనాలు, ఆయుధాలు, డాక్యుమెంట్లు ఫోర్జరీ జరిగాయా లేదా ప్రతీది ఇతర అన్ని ఆధారాలను ల్యాబ్?లోనే పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తారు. ఈ ఆధారాలు ఎన్నో కోర్టు తీర్పుల్లో కీలకంగా ఉంటాయి. కానీ ఈ ప్రమాద ప్రభావం వల్ల కేసుల దర్యాప్తుపై ఎంత వరకు పడనుందనేది ఆందోళనకరమైన విషయం.

# విద్యార్థులకు పోలీస్ శాఖ ఇంటర్న్‌షిప్

హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

హైదరాబాద్ సిటీ పోలీసులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. డేటా అనాలసిస్, రీసెర్చ్ ప్రాజెక్టులు, ఆధునిక పోలీసింగ్‌లో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్న లక్ష్యంతో.. 25 ఏళ్లలోపు డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వారికి అధికారిక ధ్రువపత్రాలు ఇవ్వనున్నారు. ఎస్ఎమ్ఐటీ సెల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించ బోతున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు.
కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

# బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి

కరీంగనర్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి రాజీవ్ రహదారిపై బైక్ ను కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై వెళ్తోన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. హుస్నాబాద్ నుంచి తోటపల్లికి వెళ్తుండగా కొత్తపల్లి దగ్గర ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో కాసేపు హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులు అవదూత శ్రీనివాస్, శ్రీరామ రామచంద్రంగా గుర్తించారు. వీరిద్దరూ బొమ్మనపల్లి మండలం చిరుగుమామిడి గ్రామస్తులుగా గుర్తించారు పోలీసులు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో స్థానికులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# క్యాతన్‌పల్లిలో బిఆర్ఎస్ జెండా ఎగరేస్తాం

## బాల్క సుమన్ తదితరులపై కేసులు ఎత్తేయాలి

## మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్

మంచిర్యాల,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

జిల్లాలోని క్యాతనపల్లిలో బాల్కసుమన్ తో పాటు బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు,చందర్, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేని శంకర్ మాట్లాడారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని అన్నారు.తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తున్నాడని ఆరోపించారు.క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులలో బీఆర్ఎస్, సీపీఐ కూటమి 14 వార్డులు గెలుచుకోగా ప్రజాస్వామ్యబద్ధంగా జరుగవలసిని చైర్మన్ ఎన్నికను మంత్రి వివేక్, ఎంపీ వంశీ అడ్డుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ డమ్మీ కమిషన్ మారిందని,బాల్క సుమన్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులపై మంత్రి వివేక్ ప్రోద్బలంతో పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. క్యాతన పల్లి మున్సిపాలిటీ చేజిక్కించు కావాలన్న కుట్రలతో బీఆర్ఎస్, సీపీఐ కూటమి కౌన్సిలర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి వివేక్ ఆదేశాలతో సింగరేణి అధికారులు క్యాతన పల్లి మున్సిపాలిటీ 11 వ వార్డు కౌన్సిలర్ భీమాగౌడ్ ఇంటిపై దాడి చేసి, కుటుంబసభ్యులపై దౌర్జన్యం చేశారని తెలిపారు. భీమాగౌడ్ తో కుటుంబానికి బీఆర్ఎస్ తరపున అండగా ఉంటామని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మాట్లాడుతూ రాజ్యాంగం పట్టుకొని తిరుగుతున్న రాహుల్ గాంధీకి రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. మంత్రి వివేక్ రేవంత్ తో తిరిగి దొంగలా మారిండని,సింగరేణి అధికారులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొని కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పినట్లు పనిచేస్తున్నారని విమర్శించారు. చెన్నూరు నియోజకవర్గంలో ఎమర్జెసి పాలన నడుస్తున్నదని ఆరోపించారు.టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ కౌన్సిలర్ భీమాగౌడ్ కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు.



# అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

## దేశ రైతులతో పాటు తెలంగాణకూ ముప్పే- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం)

:కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు. మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం నుంచి ఈ పంటలను దిగుమతి చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కేవలం 12 గంటల పాటే విద్యుత్ సరఫరా ఇస్తున్నారని, ఎరువులు సకాలంలో అందడం లేదని చెప్పుకొచ్చారు. అన్నదాతల సమస్యలను త్వరలో జరిగే రాష్ట్ర బ్జడెట్ సమావేశాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసే రైతులకు వ్యవసాయ పనిముట్లు, డ్రోన్లు, ట్రాక్టర్లు సబ్సిడీకి ఇచ్చే విధంగా బ్జడెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.



# అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

- ప్రజలకు ఎవరేంటో తెలుసు
- తనపై దాడి చేసేందుకు షబ్బీర్ కుట్ర
- ఇక ప్రజల్లో ఉంటే తేల్చుకుంటా
- తనకేదైనా జరిగితే సిఎం రేవంత్‌దే బాధ్యత
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరిక

కామారెడ్డి,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కామారెడ్డిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోయిన కామారెడ్డిలో షబ్బీర్ అలీ అన్నీ తానే అంటున్నారని చెప్పుకొచ్చారు. తనను కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్, జడ్పీటీసీ చేశామని అన్నారని.. ఆయన కామారెడ్డికి చేసిందేమీ లేదని విమర్శించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో తాను కాంగ్రెస్ నుంచి గతంలో గెలిచానని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ప్రస్తావించారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి నా రాజకీయ గురువు. నువ్వు మా తండ్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడ్డావ్. నువ్వు కట్టిన ఐదు అంతస్తుల భవనానికి మున్సిపల్ అనుమతి లేదు. ఈ నియోజకవర్గం నీ సొంతం కాదు. నీవల్లే నేను కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాను. అసెంబ్లీలో హుందాగా ఉండాలని మాట్లాడిన నన్ను ఇలా చీప్‌గా మాట్లాడేలా చేశారు. నాపై నిందలేస్తే ఎలా ఉంటుందో ఈ రోజు చూశారు. ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది. నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశా. మా వాళ్లు ఎవరూ రావద్దని నేను చెబితే మీరు వేలాదిగా తరలిరావాలని మెసేజ్‌లు పెట్టారు. రేపటి నుంచి గ్రామాలకు వస్తా, ఎవరు అడ్డుకుంటారో చూస్తా. బాన్సువాడలో గొడవ జరిగితే మేం మాట్లాడి సద్దుమణిగేలా చేశాం' అని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి తెలిపారు. 263 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎలాంటి అక్రమాలు లేవు. నేను ఒక్క గజం అమ్మినా నిరూపించాలని వెంకటరమణా రెడ్డి సవాల్ విసిరారు. 'దొంగలెవరో ప్రజలకు తెలుసు. నాకేం జరిగినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత. రేపటి నుంచి యుద్ధమే. ఇది సీఎంకు, నాకూ మధ్య యుద్ధం. కలెక్టర్ వద్ద కూర్చుందాం. కాలేజీ కమిటీ పేరిట ఎఫ్‌డీలు ఉన్నాయి. అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అక్రమాలపై పోరాడాం. తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డిలో పెట్టమని కోరాం. అప్పుడు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఏం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకోం. సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్దాం. నాపై ఒక్క తప్పు తేలినా కాళ్లు పట్టుకుంటా, పదవి వదులుకుంటా. రమ్మంటే సీఎంఒకు వస్తా' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీ భూముల్లో ఒక్క ఇంచు తేడా వచ్చిన రాజీనామా చేస్తానన్నారు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి. దొంగ ఎవరో దొర ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఇన్ని రోజులు ప్రశాంతంగా ఉన్న కామారెడ్డిని రణరంగంగా మార్చారని ఫైర్ అయ్యారు. తనను చంపుతామని బెదిరించారని..ఇవాళ ఆ పనిచేశారని ఆరోపించారు. తాను పిలిస్తే వేలమంది రోడ్లమీదకు వచ్చేవాళ్లు.. అపుడు పరిస్థితి ఎలా ఉండేదని ప్రశ్నించారు వెంకటరమణా రెడ్డి. తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. రేపటి నుంచి గ్రామాల్లో తిరుగుతా. ఇక యుద్ధ వాతారణమేనని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి హెచ్చరించారు. తనపై ఏం జరిగినా ప్రభుత్వానిది, సీఎందే బాధ్యత అనిచెప్పారు. ఇవాళ కారు బోల్తా పడింది రేపు మీ ప్రభుత్వం కూడా బోల్తా పడుతుందన్నారు. తమ కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో తన నిజాయితీ నిరూపించుకునేదాక ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటి వరకు కామారెడ్డిలో ఏది జరిగిన భరించా ఇక నుంచి భరించే ప్రసక్తే లేదన్నారు. .



# కామారెడ్డి ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడి

## కాంగ్రెస్ కార్యకర్తల దాడితో ఉద్రిక్తత

## పరస్పరం దాడి చేసుకున్న బిజెపి, కాంగ్రెస్ కార్యకర్తలు

## పోలీసులు రంగోలకి దిగడంతో అదుపులోకి పరిస్థితి

కామారెడ్డి,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి కారును భాజపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైటెన్షన్ నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం ఉద్రిక్తతలకు దారితీసింది. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నేత గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ప్రభుత్వ, అరోరా కాలేజీ భూములను వెంకట రమణారెడ్డి కబ్జా చేశారని షబ్బీర్ ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన వెంకట రమణారెడ్డి.. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉందని.. సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో శిశు మందిర్ వేదికపై బహిరంగ చర్చకు రెండు పార్టీలు సిద్ధమయ్యాయి. ఇరు పార్టీల నేతల సవాళ్లతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి క్యాంప్ ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యాంప్ ఆఫీసు నుంచి బయటకు రాకుండా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు సవాలును స్వీకరించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ముదరడంతో మహేందర్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారును బోల్తా పడేశారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరు పార్టీల నేతలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2026 సంవత్సరానికిగానూ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైమ్‌టేబుల్‌ను విడుదల చేసింది. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఇప్పుడు పూర్తి షెడ్యూల్‌ను చూసుకోవాలని సూచించింది. షెడ్యూల్‌ను పూర్తిగా తేదీల వారీగా పరిశీలించుకోవాలని పేర్కొన్నది. తాజా టైమ్‌టేబుల్ ప్రకారం.. పదో తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో జరగనున్నాయి.

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
22 ఆదివారం, ఫిబ్రవరి 2026
9
www.prajaveekshanam.in

# ఆరు రాష్ట్రాల్లో పూర్తయిన సర్ ప్రక్రియ

## గుజరాత్‌లో 68 లక్షల 12 వేల 711 ఓట్ల తొలగింపు

## వవరాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

ఆరు రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయింది. ఆ వివరాలను ఎన్నికల కమిషన్ శనివారంనాడు విడుదల చేసింది. రివిజన్ పక్రియలో భాగంగా ఆయా రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో అనర్హత కలిగిన ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. తాజాగా విడుదల చేసిన జాబితాలో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల కంటే గుజరాత్‌లో అత్యధికంగా ఓటర్ల తొలగింపు చోటుచేసుకుంది. రికార్డు స్థాయిలో 68 లక్షల 12 వేల 711 మందిని జాబితా నుంచి తొలగించింది. ఎస్ఐర్ పక్రియకు ముందు 5,08,43,436 మంది ఓటర్లు ఉండగా అది ప్రస్తుతం 4,40,30,725కు తగ్గింది. మధ్యప్రదేశ్‌లో 34,25,078 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించింది. దీంతో ఓటర్ల సంఖ్య 5,74,06,143 నుంచి 5,39,81,065కు తగ్గింది. తర రాష్ట్రాల్లోనూ గణనీయంగా ఓటర్ల జాబితాలో సవరణలు చేటుచేసుకున్నాయి. రాజస్థాన్‌లో ఓటర్ల సంఖ్య 5,46,56,215 నుంచి 5,15,19,929 మందికి తగ్గింది. ఛత్తీస్‌గఢ్‌లో 2,12,30,737 నుంచి 1,87,30,914కు, కేరళలో 2,78,50,855 నుంచి 2,69,53,644కు తగ్గింది. గోవాలో ఓటర్ల సంఖ్య 11,85,034 నుంచి 10,57,566కు తగ్గింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ ఐలాండ్స్‌లో 52,364 మందిని జాబితా నుంచి తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 3,10,404 నుంచి 2,58,040కి తగ్గింది. పుదుచ్చేరిలో ఓటర్ల సంఖ్య 10,21,578 నుంచి 9,44,211 మందికి, లక్షద్వీప్‌లో 57,813 నుంచి 57,607కు తగ్గింది. ఓటర్ల మరణం, శాశ్వతంగా నివాసస్థలాల మార్పు, పలుచోట్ల రిజిస్టర్ చేయించుకోవడం, ఇతర అనర్హత కారణాల వల్ల ఓటర్ల తొలగింపు జరిగిందని, కొత్త ఓటర్లకు జాబితాలో చోటు కల్పించామని ఈసీ తెలిపింది. ఎన్నికల జాబితా అప్‌డేట్ అనేది నిరంతర పక్రియ అని, అర్హత కలిగిన పౌరులు అప్లయ్ చేసుకోవడం, ఎంట్రీల కరెక్షన్ వంటివి చేసుకోవచ్చని పేర్కొంది.

# జ్వరంతో ఆస్పత్రికి వెళ్లగా శిశువు మరణం

## వైద్యుల నిర్లక్ష్యంపై మండిపడ్డ కుటుంబం

**హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

నగరంలోని ఓ ఆస్పత్రిలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఆరు నెలల శిశువు చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే సాధారణ జ్వరంతో ఆస్పత్రికి వెళ్లామని.. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ ప్రాణాలు పోయాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. సన్ సిటీకి చెందిన దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు కాగా.. ఇటీవల బాబు జన్మించాడు. ఆరు నెలల వయసున్న బాబుకు స్వల్పంగా జ్వరం రావడంతో తల్లిదండ్రులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే జ్వరంతో వెళ్లిన బాబుకు.. వైద్యులు అత్యవసర సమయాల్లో ఇచ్చే ఇంజెక్షన్ ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంజెక్షన్ ఇచ్చిన కొద్ది నిమిషాల్లోనే పసికందు శరీరం రంగు మారిపోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి యాజమాన్యం గడువు ముగిసిన మందులు ఇచ్చిందని, దీనివల్లే తమ బిడ్డ చనిపోయాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇద్దరు ఆడపిల్లల తర్వాత పుట్టిన బాబు కావడంతో అల్లారుముద్దుగా చూసుకున్నామని తల్లిదండ్రులు కన్నీరుమున్నీర వుతున్నారు. శిశువు మృతి వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆస్పత్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# విద్యుత్ సంస్థ నియామకాల్లో బిసి రిజర్వేషన్ల ఉల్లంఘన

## మార్చి 4న నేరుగా

## పరిశీలించాలని కమిషన్ నిర్ణయం

**హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్ మరియు ఎస్‌పీడీసీఎల్ సంస్థల నియామకాలలో రిజర్వేషన్ల ఉల్లంఘన జరుగుతుందని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం బిసి కమిషన్ దష్టికి తీసుకువచ్చింది. ఈ అంశంపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. ఇందులో భాగంగా మార్చి 4వ వారంలో విద్యుత్ సంస్థల కార్యాలయాలను సందర్శించి ఈ విషయంపై విచారణ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. మరోవైపు రాష్ట్రంలోని విద్యార్థుల వివరాల సేకరణ వేగవంతం చేయాలని కమిషన్ అధికారులకు సూచించింది. రాష్ట్ర బీసీ కమిషన్ సమావేశం శనివారం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాల మాయ దేవి, పాల్గొన్నారు. ఈ సమావేశంలో అధికారులు డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్ హాజరయ్యారు. సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది.

# రియల్ ప్రాజెక్టు ప్రకటనల్లో రెరా రిజిస్ట్రేషన్ తప్పనిసరి

## నిబంధనలు ఉల్లంఘించిన

## అమేయ, వర్టెక్స్, గోద్రేజ్ ప్రాజెక్టులు

## ఆయా సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ

**హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

ఇల్లు/ప్లాట్/యూనిట్ అమ్మకాలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ రిజిస్ట్రేషన్ లేకుండా కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ముందస్తు ప్రకటనలు ఇచ్చి మోసం చేయద్దని ప్రమోటర్లు/డెవలపర్లు, ఏజెంట్లు మరియు ప్రచార మాధ్యమాలను తెలంగాణ రెరా అథారిటీ గట్టిగా హెచ్చరించింది.రెరా చట్టం ప్రకారం, 500 చదరపు మీటర్లు దాటితే మరియు8 కంటే ఎక్కువ యూనిట్లు కలిగి ఉన్న ప్రతి ప్రాజెక్టును ముందుగా తెలంగాణ రెరాలో రిజిస్టర్ చేయాలని, రెరా అథారిటీ ప్రాజెక్టు వివరాలను పరిశీలించి, రిజిస్ట్రేషన్ నంబరును మంజూరు చేసిన తర్వాతే ఆ నంబరు ద్వారా అమ్మకాలపై ప్రకటనలు చేయాలని మోటర్లు/డెవలపర్లు, ఏజెంట్లు మరియు ప్రచార మాధ్యమాలను సూచించింది. ఇందులో భాగంగా ఇటీవల రిజిస్ట్రేషన్ నంబరు పొందుపరచనిచట్టవిరుద్ధమైన ప్రకటనలు రెరా దృష్టికి రావడంతో ఆయా ప్రాజెక్టు సంస్థలకు రెరా అథారిటీ షోకాజ్ నోటీసులను జారీ చేసింది. గోద్రెజ్ ప్రాపర్టీస్, నవనామి ఎలివేట్ ప్రాజెక్టు, వర్టెక్స్ విరాట్ ప్రాజెక్టు, స్వర్గసీమ అమేయ ప్రాజెక్టు, తిరుమల హిల్స్ మొదలగు రియల్ ఎస్టేట్ కన్ స్ట్రక్షన్ కంపెనీలు ఇందులో ఉన్నాయి. కొన్ని కన్ స్ట్రక్షన్ కంపెనీలు రెరా రిజిస్ట్రేషన్ నంబరును పొందుపరిచినప్పటికీ, ఆ ప్రకటన రెరా నిబంధనల మేరకు లేనట్టు గా అథారిటీ గుర్తించింది. స్వర్గసీమ కన్ స్ట్రక్షన్ వారి అమేయ ప్రాజెక్టు ప్రకటనలో అక్షరాల సైజు, ప్రాజెక్టు పూర్తిపేరు, లేఅవుట్ గా రిజిస్టర్ చేసి, ప్రకటన మాత్రం పూర్తి రెసిడెన్షియల్ ప్రాజెక్టుగా చూపిస్తూ కొనుగోలుదారులను తప్పు దోవ పట్టించడం లాంటి ఉల్లంఘనలను గమనించిన రెరా, ఆ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

# మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హౌస్ అరెస్టు

## కామారెడ్డి వెళ్లకుండా

## అడ్డుకున్న పోలీసులు

**మేడ్చల్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డితోపాటు పెద్ద ఎత్తున ఈటల నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయన్ను ఇంట్లోనే నిర్బంధించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిమీద దాడి నేపథ్యంలో ఆయన్ని పరామర్శించేందుకు ఈటల రాజేందర్ కామారెడ్డి బయల్దేరారు. ఈ క్రమంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈటలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఈటల తీవ్రంగా ఖండించారు.

# మొబైల్ షాపులో షార్ట్ సర్క్యూట్

## అగ్నిప్రమాదంలో పది లక్షల ఆస్తి బుగ్గి

**నల్లగొండ,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

నల్గొండ జిల్లాలో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో భారీ ఆస్తి నష్టం సంభవించింది. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని సాయి విఘ్నేశ్వర ఆటోమొబైల్ షాప్‌లో ఈ అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. స్థానికులు.. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు,్గ ÷ర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాప్‌లో నుంచి ఒక్కసారిగా పొగ వ్యాపించింది. కాసేపటికే మంటలు వేగంగా వ్యాపించడంతో షాపులో ఉన్న స్పేర్ పార్ట్స్, వాహనాలకు సంబంధించిన సామగ్రి అగ్నికి ఆహుతైంది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ÷ర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే షాప్‌లో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయినట్లు తెలుస్తోంది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. విద్యుత్ వైర్లలో లోపం వల్ల మంటలు చెలరేగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఘటనతో స్థానిక వ్యాపారులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ పరికరాలు, వైరింగ్ వ్యవస్థలను తరచూ తనిఖీ చేయించుకోవాలన్గి ÷ర్ సేఫ్టీ అధికారులు సూచించారు.

# వైసిపి రాజకీయ పరాచకాలు ఆడుతోంది

## వేంకటేశ్వరాలయంలో

## ప్రత్తిపాటి పూజలు

**పల్నాడు,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

చిలకలూరిపేటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సంప్రోక్షణ చర్యలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ఆలయాన్ని శుద్ధి చేశారు ప్రత్తిపాటి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరునితో వైసీపీ రాజకీయ పరాచకాలు ఆడుతోందని మాజీ మంత్రి తీవ్రంగా విమర్శించారు. స్వామివారిని రాజకీయ ఆయుధంగా వాడుకోవడం దుర్మార్గమని.. మహా పాపమని అన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీయాలన్నదే వైసీపీ లక్ష్యమన్నారు. మండలిలో తమకు బలం ఉందని భావించి కుట్రలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారని రుజువైనా కావాలనే శాసనమండలిలో రచ్చ చేస్తున్నారని ప్రత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు. కల్తీ నెయ్యి అంశాన్ని పక్కదారి పట్టించడానికే హెరిటేజ్ సంస్థను రాజకీయాల్లోకి లాగారని తెలిపారు. ఃూజకీయాలకు తనను వాడుకుంటున్న వారిని శ్రీవారు కచ్చితంగా శిక్షిస్తారనేది చరిత్ర ఎరిగిన సత్యమని హెచ్చరించారు. హిందూ సమాజం, శ్రీవారి భక్తుల మనోభావాలు కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు.

# ట్రైన్ ఎక్కుతూ కిందపడ్డ ప్రయాణికుడు

## తీవ్ర గాయాలతో మృతి

**హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ట్రైన్ ఎక్కే సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిన వ్యక్తి.. తీవ్ర గాయాలతో మృతిచెందాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపగా, రైల్వే ప్రయాణికుల్లో భయాందోళనలు కలిగించింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగరాజు అనే వ్యక్తి సికింద్రాబాద్ నుంచి ఒంగోలు వెళ్లేందుకు స్టేషన్‌కు వచ్చాడు. సింహపురి ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఎక్కాల్సి ఉండగా.. తొందరలో మరో ట్రైన్‌ను ఎక్కేందుకు ప్రయత్నించాడు. ట్రైన్ కదులుతున్న సమయంలో కాలు జారి ప్లాట్‌ఫామ్‌కు, ట్రైన్‌కు మధ్యలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. ఈ ఘటన మరోసారి రైల్వే ప్రయాణికులకు అప్రమత్తత అవసరాన్ని గుర్తు చేసింది. ట్రైన్ కదులుతున్న సమయంలో ఎక్కేందుకు ప్రయత్నించకూడదని, అలాంటి చర్యలు ప్రాణాపాయానికి దారి తీస్తాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లలో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. నాగరాజు మృతితో.. టుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు

## ఉదయం వటపత్రశాయి..

## రాత్రి హంసవాహనం

**యాదగిరిగుట్ట,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంపై స్వామివారు ఊరేగారు. బ్రహ్మోత్సవాలు, వారాంతం కావడంతో యాదగిరిగుట్టకు భారీగా భక్తులు తరలివచ్చారు.కాగా, లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 28 వ తేదీ వరకు జరుగనున్నాయి. 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 28న అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలను అధికారు రద్దు చేశారు.

# కోల్‌కతా తరలిస్తున్న తాబేళ్ల పట్టివేత

**ఏలేశ్వరం,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

అక్రమంగా కలకత్తాకు పెద్ద ఎత్తున తరలిస్తున్న తాబేళ్లను ఏలేశ్వరం అటవీశాఖ అధికారులు శనివారం జాతీయ రహదారిపై స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం అటవీ శాఖ అధికారి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కోనసీమ రామచంద్రాపురం నుండి కలకత్తాకు బొలెరో వాహనంపై తాబేళ్ళు తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా 320 తాబేళ్ళు గోనిసంచెల్లో చుట్టుకుని బొలెరో వాహనంపై ఎక్కించి పైన ఎవరికీ అనుమానం రాకుండా చేపలు బుట్టలు వేశారన్నారు. ఈ కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకోగా వారి సమాచారం ప్రకారం కలకత్తా ప్రాంతాలలో ఈ తాంబేలుకు మంచి డిమాండ్ ఉందని మాత్రమే తెలిపారన్నారు. వేటికి వినియోగించేది తెలియ రాలేదని ఆయన పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిందితులను, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని తాబేళ్లను ఏలేరు రిజర్వాయర్లలో విడుదల చేసినట్లు అటవీశాఖ అధికారి తెలిపారు. నిందితులను యానిమల్ ప్రొడక్షన్ యాక్ట్ కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నామన్నారు.

# రామ్మోహన్ నాయుడిని తొలగించండి

## ప్రధాని మోడీకి ఎన్‌సిపి ఎమ్మెల్యే రోహిత్ పవార్ లేఖ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడిని తక్షణమే పదవి నుండి తొలగించాలని కోరుతూ ఎన్‌సిపి (శరద్‌పవార్) ఎమ్మెల్యే రోహిత్ పవార్ శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఒక లేఖ రాశారు. ఈ ఏడాది జనవరి 28న బారామతి ఎయిర్‌పోర్టులో జరిగిన విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి అజిత్ పవార్ సహా ఐదుగురు చనిపోయిన సంగతి తెలిసిందే. ఒక కుట్రలో భాగంగానే నాటి ప్రమాదం జరిగిందని, విమానయాన సంస్థకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న టిడిపికి సన్నిహిత సంబంధాలున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రమాదంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని మోడీకి తన లేఖలో రోహిత్ విన్నవించారు. ఇదే విషయంపై ఆయన మీడియాతోనూ మాట్లాడారు. నాటి ప్రమాదం వెనుక రెండు కోణాలు వుండేందుకు అవకాశం వుందని అవి రాజకీయ లేదా వాణిజ్యపరమైన కోణాలు కూడా కారణం కావచ్చని ఆయన పేర్కొన్నారు. వాటిల్లో ఏది కారణమనేది తేల్చుకోవాలని తమ పార్టీ ప్రయత్నిస్తోం దన్నారు. ఒక కుట్రలో భాగంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఎయిర్ చార్టర్ కంపెనీ విఎస్‌ఆర్‌కు ఇందులో ప్రమేయం వుందన్నారు. విఎస్‌ఆర్ కంపెనీ గురించి, రామ్మోహన్ నాయుడు పార్టీ తెలుగుదేశంతో దానికి గల సంబంధాల గురించి అనేక తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. అందువల్ల స్వతంత్ర, సమర్ధవంతమైన అధికారితో ఈ సంబంధాలపై దర్యాప్తు జరగాలన్నారు. ప్రాధాన్యతా ప్రాతిపదికన అంతర్జాతీయ సంస్థల సహకారం తీసుకోవాలని ఆ లేఖలో ఆయన సూచించారు. లేఖ ప్రతిని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కూడా పంపారు. అజిత్ పవార్‌కు సన్నిహిత బంధువు అయిన రోహిత్ పవార్ మొదట నుండి ఈ ప్రమాదంలో కుట్ర కోణం వుందంటూ మీడియాతో మాట్లాడుతునే వస్తున్నారు. పారిశ్రామిక, రాజకీయ రంగాలకు చెందిన అనేకమంది పలుకుబడి కలిగిన వ్యక్తులు ఈ విఎస్‌ఆర్‌లో వున్నారని తన నిర్ధారణల్లో తేలిందన్నారు. ఈ కారణంగానే దర్యాప్తు పక్రియ పారదర్శకంగా జరగబోదని తాను భావిస్తున్నానన్నారు.

GENERAL NEWS
22 ఆదివారం, ఫిబ్రవరి 2026 | 10 | www.prajaveekshanam.in
ప్రజావీక్షణం దినపత్రిక

# ఆయేషా మీరా హత్య కేసు ముగింపు

**విజయవాడ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు**

**అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగింత!**

**ఫిబ్రవరి 27న తెనాలిలో అంత్యక్రియలు**

అమరావతి, ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం):

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో విజయవాడలోని సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తును ముగిస్తున్నట్లు ప్రకటించిన న్యాయస్థానం.. వైద్య బృందం సేకరించిన ఆయేషా భౌతిక అవశేషాలను ఆమె తల్లిదండ్రులకు అప్పగించాలని సీబీఐని ఆదేశించింది. ఫిబ్రవరి 27న తెనాలిలో ప్రభుత్వ భద్రత నడుమ మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆయేషా హత్య కేసులో నిందితులను గుర్తించడానికి తగిన ఆధారాలు లభించలేదని సీబీఐ ఇటీవల కోర్టుకు తుది నివేదిక సమర్పించింది. ఈ నివేదికను తాజాగా న్యాయస్థానం ఆమోదించింది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయేషా మీరా మృతదేహానికి రెండో సారి పోస్టుమార్టం నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి వైద్యుల అభిప్రాయం తీసుకున్న అనంతరం అవశేషాలను సీబీఐ కోర్టు ముందుంచారు. ఈ క్రమంలో తమ కుమార్తె అవశేషాలను అంత్యక్రియల నిమిత్తం తమకు అప్పగించాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు షంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, ఫిబ్రవరి 27వ తేదీ తెనాలిలో అంత్యక్రియలు జరపాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని సీబీఐ, రెవెన్యూ, పోలీసు అధికారులు, మత పెద్దల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అవశేషాల తరలింపునకు ప్రత్యేక వాహనం, ఎస్కార్ట్, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2007లో విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలోని హాస్టల్‌లో ఆయేషా మీరా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే.

# తిరుమలలో పెరిగిన రద్దీ

## దర్శనానికి 18 నుంచి 20 గంటలు

## వేసవి రద్దీకి అనుగుణంగా టిటిడి ప్రణాళిక

తిరుమల,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

తిరుమల శ్రీవారి దర్శనానికి శనివారం యాత్రికులు పోటెత్తారు. దీంతో స్వామి వారి సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. కాగా శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. ఇదిలావుంటే త్వరలో ప్రారంభం కానున్న వేసవి సెలవులకు రానున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సమర్థవంతంగా చేపడుతున్నట్లు టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. గత రెండు,మూడు సంవత్సరాల వేసవి డేటాను విశ్లేషించి, దర్శనాల సంఖ్య, వేచి ఉండే సమయం, తర్వాత రోజు దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సంఖ్య వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్, అవసరమైన చోట్ల షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సామాన్య భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించి వీలైనంత త్వరగా దర్శనం కలిగేలా చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అదనపు ఈవో తెలిపారు. ఈసారి ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచి, గంటల వారీగా ఇన్?అవుట్ ఎ÷–లో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. వివిధ కేటగిరీల దర్శనాలను డేటా ఆధారంగా హేతుబద్ధంగా కంపార్ట్‌మెంట్లు క్యూ లైన్లలో భక్తులు వేగంగా దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.గత వేసవిలో జూన్ నెలలో సగటున రోజుకు 80 వేల నుంచి 82 వేల మందికి దర్శనం కల్పించామని, అలాగే 2026 జనవరిలో రోజుకు సగటున 74 వేల మందికి పైగా దర్శనం కల్పించినట్లు గుర్తు చేశారు. ఇది సమర్థవంతమైన టైమ్ మేనేజ్‌మెంట్, అన్ని విభాగాల సమన్వయంతో సాధ్యమైందని వివరించారు .వేసవిలో భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టీటీడీ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని అదనపు ఈవో ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ప్రతి కుక్కకూ ఓ రోజు వస్తుంది

**ఎన్ని కేసులు పెట్టినా, చావనైనా చస్తాను**

**ఎట్టిపరిస్థితుల్లో నేను తగ్గనే తగ్గను**

**వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు**

అమరావతి, ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం):



వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రతి కుక్కకూ ఒక రోజొస్తుంది. ఈ రాంబాబు అనే కుక్కకు కూడా ఓ రోజు వస్తుంది. అప్పుడు తగ్గనే తగ్గను' అని ఆయన ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఆయన, బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. అనంతరం నిన్న గుంటూరులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మీడియా సమావేశానికి ముందు, ఆయన తాడేపల్లిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. తనపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయించారని జగన్‌కు వివరించారు. దీనిపై స్పందించిన జగన్, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయపోరాటం చేద్దామని భరోసా ఇచ్చారు. మీడియాతో మాట్లాడుతూ, తాను ఆవేశంలో అన్న మాటలపై రియలైజ్ అయ్యానని తెలిపారు. జైలు జీవితాన్ని ఎంజాయ్ చేశానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. తన పోరాటం మాత్రం ఆగదని స్పష్టం చేశారు. 'ఎన్ని కేసులు పెట్టుకున్నా తగ్గను. చావనైనా చస్తాను గానీ, తగ్గే ప్రసక్తే లేదు' అని పేర్కొన్నారు.

# ప్రేయసి ఆత్మహత్యతో టెక్కీ ఆత్మహత్య

విశాఖపట్నం,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

భీమిలీలో విషాదం చోటుచేసుకుంది. స్థానికంగా గల ఒక హోటల్ లో శ్యాం కూమార్ అనే సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఉద్యోగి మృతికి ప్రేమ వ్యవహారమే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొద్దిరోజుల క్రితం తన ప్రియురాలితో శ్యాంకుమార్ గొడవపడ్డారు.

# కార్లతో ర్యాలీతో నోటీసుల ఉల్లంఘన..

**అంబటి రాంబాబు,**

**జక్కంపూడి రాజాలపై కేసు నమోదు**

అమరావతి, ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం):

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుపై మరో కేసు నమోదయింది. ఆయనతో పాటు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు వైసీపీ నేతలపై కూడా రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఇచ్చిన నోటీసులను ధిక్కరించి భారీ ర్యాలీ నిర్వహించడంతో వివిధ సెక్షన్ల కింద కేసు ఫైల్ చేశారు. ఈ కేసును రాజమండ్రి ప్రకాశ్ నగర్ సీఐ బాజీలాల్ విచారణ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబు రెండు రోజుల క్రితం బెయిల్ పై విడుదలైన సంగతి తెలిసిందే. ఈనెల 19న రాజమండ్రి నుంచి గుంటూరుకు బయలుదేరిన అంబటి రాంబాబుకు పోలీసులు సెక్షన్ 30 కింద నోటీసులు అందించారు. కార్లతో భారీ ఊరేగింపు నిర్వహించవద్దని, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై అధిక వాహనాలతో వెళ్లకూడదని నోటీసులో పేర్కొన్నారు. అయినప్పటికీ అంబటి, జక్కంపూడి రాజా తమ అనుచరులతో కలిసి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వారిపై కేసులు నమోదయ్యాయి.

# పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం

- పాతవస్తువులు ఇస్తే నిత్యాసవర వస్తువులు ఇస్తున్నాం
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కూడా బాధ్యతే
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో చెత్త ఏరివేత చేపట్టాం
- వినుకొండ సభలో సిఎం చంద్రబాబు వెల్లడి



పల్నాడు,ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం):

గ్రామీణ ప్రాంతాల్లో మార్చి 31 నాటికి చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిదని సీఎం చంద్రబాబు అన్నారు. మండలానికి ఒక స్వచ్ఛరథం ఏర్పాటు చేస్తున్నామని, వారానికి ఒకసారి గ్రామానికి స్వచ్ఛరథం వస్తుందని చెప్పారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన ' స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. స్వచ్ఛరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ప్రజావేదిక వద్ద స్టాళ్లను పరిశీలించారు. స్వచ్ఛ రథం వచ్చినప్పుడు పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు మీకు ఆదాయం వస్తుందని చంద్రబాబు అన్నారు. సరిసరాల పరిశుభ్రతతోనే మన ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. పరిశుభ్రత కోసం మనమంతా కంకణ బద్ధులం కావాలన్నారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని 2025 జనవరిలో ప్రారంభించాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగుతున్నాయి. పచ్చదనం- పరిశుభ్రత, నీరు-మీరుతో ప్రజల వద్దకు వస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం. నేను సీఎంగా వచ్చేనాటికి 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దానిని క్రమంగా తొలగిస్తున్నాం. వర్షాలు పడినప్పుడు భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. కలుషిత నీళ్లు తాగితే డయేరియా వంటి అనేక సమస్యలు వస్తాయి. ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టాం అని వివరించారు. ప్రతి నెల మూడో శనివారం ఎక్కడ ఉన్నా కార్యక్రమానికి హాజరువుతున్నా. మున్సి పాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను వంద శాతం సేకరిస్తున్నారు. మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోనూ చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిది. రాబోయే రోజుల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తుంది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' హిట్ అయ్యింది. 'పేదల సేవలో' కార్యక్రమం కింద మొదటి తేదీనే ఇంటింటికి వస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తున్నాం. ప్రతి ఎకరాకు నీళ్లిస్తున్నాం అన్నారు. గిట్టుబాటు వచ్చే పంటలు వేయిస్తున్నాం. రైతులకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. అగ్రికల్చర్ నిపుణులను అందుబాటులో ఉంచు తున్నాం. రైతాంగం టెక్నాలజీని అందిపుచ్చుకుంటోంది. మైక్రో ఇరిగేషన్, బిందుసేద్యం తదితర కార్యక్రమాలను నేనే ప్రారంభించానని వివరించారు. వారసత్వంగా వచ్చే పంటలే పండిస్తే ఆదాయం లేకుండా ఇబ్బందులు వస్తున్నాయి. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో రూ.5కే భోజనం పెడుతున్నాం. మెరుగైన జీవన ప్రమాణాల కోసం పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. ఆదాయం పెంచే మార్గాలను నేర్పించి వారిని ఆదుకుంటున్నాం అని అన్నారు. కొత్త విషయాలు నేర్చుకునేందుకు ముందుంటా. ఆదాయానికి చిరునామాగా మన రాష్ట్రం ఉండాలి. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారనేది ప్రజలు గమనించాలి. ఢిల్లీలో జరిగిన ఏఐ సమిట్‌కు కాంగ్రెస్ వాళ్లు ఆటంకం కలిగించారు. నిన్న ఢిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల వైఖరి చూసి చాలా బాధపడ్డా. దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని చంద్రబాబు అన్నారు.

# తిరుమలలో పోటెత్తిన భక్తులు..

**సర్వదర్శనానికి**

**20 గంటల సమయం**

తిరుమల, ఫిబ్రవరి 21(ప్రజా వీక్షణం):

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొండపై భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం ఉదయం వెల్లడించిన వివరాల ప్రకారం, శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. గురువారంతో పోలిస్తే దర్శన సమయం 10–12 గంటల నుంచి ఒక్కసారిగా 20 గంటలకు చేరడం రద్దీ తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు, రానున్న వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన సమయాన్ని తగ్గించే లక్ష్యంతో టీటీడీ అదనపు ఈవో ఆధ్వర్యంలో నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

# మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం

**వాసుదేవరెడ్డిని అదుపులోకి తీసుకున్న సిట్**

అమరావతి,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

మద్యం కుంభకోణం కేసులో.. విచారణను సిట్ వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారుల్లో ఒకరైన వాసుదేవరెడ్డిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రూ. 3,500 కోట్ల మేర అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఈ కేసులో వాసుదేవరెడ్డి అరెస్ట్ అత్యంత కీలకంగా మారింది.వాసుదేవరెడ్డి వైసీపీ హయాంలో బెవరేజెస్ కార్పొరేషన్‌లో కీలక బాధ్యతల్లో ఉండి, మద్యం పాలసీ రూపకల్పన, కంపెనీల ఎంపికలో కీలక పాత్ర పోషించినట్లు సిట్ అధికారులు నిర్ధారించారు. మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డిని రెండో నిందితుడిగా (ఎ2) సిట్ అధికారులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయన కొన్ని మద్యం కంపెనీలకు లబ్ది చేకూర్చారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ.. సిండికేట్లకు మేలు చేస్తూ వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లు సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి వాసుదేవరెడ్డి ఇప్పటికే కింది కోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కోర్టు బెయిల్ నిరాకరించడంతో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో విచారణ జరుగుతుండగానే పోలీసులు ఆయన్ని అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఈ కేసులో కీలక వ్యక్తుల పేర్లు బయట పెట్టేందుకు వాసుదేవరెడ్డి 'అప్రూవర్' గా మారే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఆయన అప్రూవర్‌గా మారితే.. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది బయటకు వచ్చే అవకాశం ఉంది. వాసుదేవరెడ్డి అరెస్ట్‌తో ఏపీ రాజకీయాల్లో వేడి రాజుకుంది.

# వైసిపి అధ్యక్ష బాధ్యతల నుంచి జగన్‌ను తప్పించండి

**జగన్‌ను తొలగిస్తే విపక్ష హోదా**

**అయినా దక్కుతుంది**

**మంత్రి టిజి భత్ సంచలన వ్యాఖ్యలు**

కర్నూలు,ఫిబ్రవరి21(ప్రజా వీక్షణం):

వైసిపి ధ్యక్షుడిగా ఉన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థానంలో కొత్త వ్యక్తిని ఎన్నుకుంటే.. 2029 ఎన్నికల్లో కనీసం ప్రతిపక్ష హోదా అయినా దక్కే అవకాశం ఉంటుందని మంత్రి టిజి భరత్ సూచించారు. వైసీపీ అధ్యక్షుడిని మార్చాలని భావిస్తున్న నాయకులకు తాను ఆర్థికంగా సహాయం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని టీజీ భరత్ తెలిపారు.ఈ మేరకు వైసీపీ నేతలకు మంత్రి టీజీ భరత్ బంపరాఫర్ ప్రకటించారు. కర్నూలులో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై కూడా మంత్రి స్పందించారు. ఈ ఘటన వెనుక పలు కుట్రలు దాగి ఉన్నాయనే అనుమానం వ్యక్తం చేశారు. జగన్ తిరుపతికి వెళ్లి తన పాలనలో తప్పులు జరిగాయని అంగీకరించి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద శ్రీవారిని క్షమాపణ కోరితే ఈ వివాదం ఇంత పెద్దది అయ్యేదే కాదని వ్యాఖ్యానించారు. ఇక రాష్ట్ర రాజకీయ భవిష్యత్తుపై కూడా టీజీ భరత్ ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం దీర్ఘకాలం అధికారంలో కొనసాగుతుందని, ఇటీవల ఒక ఐఏఎస్ అధికారి కూడా 2039 వరకూ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తనతో చెప్పారన్నారు.

# ఆస్ట్రేలియాను చిత్తు చేసిన భారత్

## 2-1తో ద్వైపాక్షిక సిరీస్ కైవసం ! - సమిస్తిగారాణించిన టీమిండియా మహిళలు



ఆస్ట్రేలియా గడ్డపై భారత మహిళల క్రికెట్ జట్టు అద్భుతం సృష్టించింది. అడిలైడ్ ఓవల్ వేదికగా శనివారం జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాపై 17 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుని దశాబ్దాల చరిత్ర తిరగరాసింది. దాదాపు పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియాలో ద్వైపాక్షిక సిరీస్ గెలవడం విశేషం. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 176 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా జట్టును మన బౌలర్లు తీవ్రంగా ఒత్తిడికి గురిచేశారు. కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి ఆసీస్ జట్టు 20 ఓవర్లు ముగిసేసరికి తొమ్మిది వికెట్లు కోల్పోయి కేవలం 159 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు సమిష్టి కృషితో సాధించిన ఈ అద్భుతమైన విజయం పట్ల దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచింది. భారత బ్యాటింగ్ ఇన్నింగ్స్‌లో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, యువ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వీరవిహారం చేశారు. ఆరంభంలోనే షఫాలీ వర్మ వికెట్ కోల్పోయిన దశలో ఈ ఇద్దరూ కలిసి ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. స్మృతి మంధాన కేవలం 55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో చెలరేగి 82 పరుగులు సాధించి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించింది. మరోవైపు జెమీమా రోడ్రిగ్స్ కూడా ఎంతో ధాటిగా ఆడుతూ 46 బంతుల్లో 59 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు అత్యంత కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో భారత్ భారీ స్కోరు దిశగా పయనించింది. ఆఖర్లో వరుస వికెట్లు పడినప్పటికీ, వీరిద్దరి మెరుపు ఇన్నింగ్స్‌లే టీమిండియా చారిత్రక విజయానికి బలమైన పునాది వేశాయి. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు భారత బౌలర్లు ఆరంభంలోనే కోలుకోలేని షాక్ ఇచ్చారు. యువ స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్, శ్రీ చరణి తమ స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. పవర్ ప్లే లోనే ఆస్ట్రేలియా టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చి మ్యాచ్‌ను మన ఆధీనంలోకి తెచ్చారు. ఆస్ట్రేలియా బ్యాటర్లలో ఆష్లీ గార్డ్నర్ (57 పరుగులు) మాత్రమే ఒంటరి పోరాటం చేసింది. మిగతా ఎవరూ పెద్దగా రాణించకపోవడంతో ఆసీస్ పరాజయం పాలైంది. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్ 3 వికెట్లు పడగొట్టగా, శ్రీ చరణి కూడా 3 వికెట్లు తీసుకుని సత్తా చాటింది. పేసర్ అరుంధతి రెడ్డి 2 వికెట్లు తీసి తన వంతు సహకారం అందించింది. వన్డే సిరీస్, టెస్ట్ మ్యాచ్‌కు ముందు ఆస్ట్రేలియా లాంటి బలమైన జట్టును వాళ్ల సొంతగడ్డపై మట్టికరిపించడం భారత జట్టు ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచుతుంది.

# అసలైన అసలైన సమరానికి తెర

## నేడు భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య సూపర్-8 పోరు

### అభిషేక్ శర్మ స్థానంలో జట్టులోకి సంజూ శాంసన్!



టీ20 వరల్డ్ కప్ 2026లో అసలైన అసలైన సమరానికి తెరలేచింది. ఆదివారం (ఫిబ్రవరి 22) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్, సౌతాఫ్రికా జట్లు సూపర్-8 పోరులో తలపడనున్నాయి. గత టీ20 వరల్డ్ కప్ ఫైనలిస్టుల మధ్య జరుగుతున్న ఈ మ్యాచ్ అంటే అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే, ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా తుది జట్టు (గ్రశ్రీఖఎఅఅస్త్ర-11) విషయంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఓపెనర్ అభిషేక్ శర్మ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో సున్నాకే అవుట్ కావడంతో, అతని స్థానంలో సంజూ శాంసన్‌ను తీసుకుంటారా అన్న సందేహాలు మొదలయ్యాయి. శుక్రవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో సంజూ శాంసన్ నెట్స్‌లో చాలా సేపు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడంతో, అతను తుది జట్టులోకి వస్తున్నాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. సాధారణంగా మ్యాచ్‌కు ముందు ఎవరైతే ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తారో, వారు ప్లేయింగ్-11లో ఉండే అవకాశం ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముందు ఉంచగా, ఆయన చాలా ఆసక్తికరంగా స్పందించారు. "ఏంటి.. సంజూను ఆడించడం కోసం అభిషేక్ శర్మను తప్పించమంటారా? లేక నంబర్-3లో ఆడుతున్న తిలక్ వర్మను పక్కన పెట్టమంటారా?" అంటూ ఎదురు ప్రశ్న వేశారు. దీన్ని బట్టి చూస్తుంటే, టీమ్ మేనేజ్మెంట్ అభిషేక్ శర్మపైనే పూర్తి నమ్మకంతో ఉన్నట్లు అర్థమవుతోంది. జట్టు ప్రదర్శనపై వస్తున్న విమర్శలను కూడా సూర్య సున్నితంగా తిప్పికొట్టారు. "ప్రస్తుతం అంతా బాగానే ఉంది. పవర్‌ప్లేలో 40-50 పరుగులు వస్తున్నాయి. మనం ద్వైపాక్షిక సిరీస్‌లలో భారీ స్కోర్లు సాధించడంతో అందరిలో అంచనాలు పెరిగిపోయాయి. ప్రతి మ్యాచ్‌లోనూ 220-240 పరుగులు చేయాలని ఆశించడం సహజమే. కానీ ఇక్కడి వికెట్లు కొంచెం భిన్నంగా ఉన్నాయి.

# అభిషేక్ శర్మ గురించి టెన్షన్ లేదు

## టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్



టీమిండియా మ్యాచ్ అంటే చాలు స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ డకౌట్ల గురించే చర్చ జరుగుతోంది. అయితే మేనేజ్‌మెంట్ నుంచి అభిషేక్ శర్మకు కావాల్సినంత సపోర్ట్ లభిస్తోంది. అభిషేక్ శర్మ డకౌట్లపై టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ సరదాగా స్పందించాడు. తాను ఆందోళన చెందుతున్నది అభిషేక్ శర్మ ఫామ్ గురించి కాదని, ప్రత్యర్థి జట్ల గురించి ఆందోళన చెందుతున్నానని తనదైనశైలిలో బదులిచ్చాడు. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8లో టీమిండియా మొదటి మ్యాచ్ దక్షిణాఫ్రికాతో నేడు తలపడనుంది. మ్యాచ్‌కు ముందు రోజు శనివారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీ20ల్లో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను అభిషేక్ శర్మ పేలవ ఫామ్ గురించి ప్రశ్నలు అడిగారు. అభిషేక్ గ్రూప్ స్టేజ్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ డకౌట్ అయ్యాడు. అయితే ఓపెనర్ బ్యాటర్ గురించి ఎలాంటి ఆందోళన లేదని, కానీ ప్రత్యర్థి జట్ల గురించి తనకు ఆందోళనగా ఉందని కెప్టెన్ సూర్య పేర్కొన్నాడు. 'అభిషేక్ శర్మ ఫామ్ గురించి ఆందోళన చెందుతున్న వారిని చూసి నేను ఆందోళన చెందుతున్నాను. అభిషేక్ శర్మ భవిష్యత్తులో ఎవరితో ఆడబోతున్నాడో ఆ జట్ల గురించి ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో అతనిని ఎదుర్కోబోయే జట్ల గురించి ఎక్కువ ఆందోళనగా ఉన్నారు. గత సంవత్సరం అభిషేక్ చాలా చేశాడు. ఇప్పుడు అతనికి మేం సహకరించాల్సిన సమయం వచ్చింది' అని సూర్య మద్దతుగా నిలిచాడు. ప్రతి మ్యాచులో 250 పరుగులు చేయాల్సిన అవసరం లేదని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. వికెట్లు కొంచెం భిన్నంగా ఉన్నాయని ఆయన చెప్పారు. తదుపరి మ్యాచ్‌లలో వచ్చే పిచ్ సవాళ్లను తాము ఎదుర్కొంటామని తెలిపారు. భారత్ నెదర్లాండ్స్‌పై ఇక్కడి నరేంద్ర మోదీ స్టేడియంలోనే విజయం సాధించింది, ఇప్పుడు దక్షిణాఫ్రికాతో సూపర్-8 మ్యాచ్ కూడా అక్కడే జరగనుంది. ప్రస్తుత ఎడిషన్‌లో దక్షిణాఫ్రికా కూడా ఈ గ్రౌండ్‌లో 2 మ్యాచ్‌లు ఆడి రెండింటిలోనూ విజయం సాధించింది. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8లో భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం జరగనుంది. నెదర్లాండ్స్ మ్యాచులో అభిషేక్ వరుసగా మూడవసారి డకౌట్ అయ్యాడు. అంతకుముందు పాకిస్తాన్, అమెరికాలపై కూడా ఖాతా తెరవలేదు. ఇప్పటివరకు టోర్నీలో ఓడిపోనప్పటికీ, ఇకనుంచి అభిషేక్ పరుగులు చేయడం జట్టుకు అవసరం. కానీ తన ఆటగాడికి కెప్టెన్ నుంచి సపోర్ట్ లభించింది. దక్షిణాఫ్రికాపై భారత్ ప్లేయింగ్ 11 అంచనా అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా.



# ఆసీస్ భారీ విజయం..

## ఒమన్‌పై 9 వికెట్ల తేడాతో గెలుపు

టీ20 ప్రపంచకప్ 2026లో ఆస్ట్రేలియా జట్టు తమ చివరి లీగ్ మ్యాచ్‌లో భారీ విజయాన్ని నమోదు చేసింది. పల్లెకెలె వేదికగా శుక్రవారం జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో పసికూన ఒమన్‌పై 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి టోర్నీని ముగించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆసీస్ బౌలర్ల ధాటికి ఒమన్ జట్టు కేవలం 16.2 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది. అనంతరం 105 పరుగుల చిన్న లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఎక్కడా తగ్గలేదు. ఓపెనర్లు ఆది నుంచే విరుచుకుపడ్డారు. ముఖ్యంగా కెప్టెన్ మిచెల్ మార్ష్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 9.4 ఓవర్లలోనే ఒక వికెట్ నష్టపోయి 108 పరుగులు చేసి మ్యాచ్‌ను లాంఛనంగా ముగించారు. దీంతో ఆస్ట్రేలియా ఇంకా 62 బంతులు మిగిలి ఉండగానే ఈ అద్భుత గెలుపును తమ ఖాతాలో వేసుకుంది. టోర్నీలో వరుస ఓటములతో ఇదివరకే ఇంటిదారి పట్టిన ఆసీస్ జట్టుకు ఈ విజయం కాస్త ఊరటనిచ్చింది. బంతితో మాయ చేసిన ఆడమ్ జంపాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఒమన్ జట్టుకు ఆస్ట్రేలియా బౌలర్లు చుక్కలు చూపించారు. ఇన్నింగ్స్ మొదటి బంతికే జేవియర్ బార్ట్‌లెట్ వికెట్ తీసి ఒమన్‌ను దెబ్బకొట్టాడు. ఆ తర్వాత కూడా ఆసీస్ బౌలర్లు కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసి ప్రత్యర్థికి ఎక్కడా అవకాశం ఇవ్వలేదు. స్పిన్నర్ ఆడమ్ జంపా తన మాయాజాలంతో ఒమన్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. కేవలం 21 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టి వారి పతనాన్ని శాసించాడు. అలాగే గ్లెన్ మాక్స్‌వెల్ రెండు వికెట్లు (2/13), జేవియర్ బార్ట్‌లెట్ రెండు వికెట్లు (2/27) తీసి ఒమన్‌ను పూర్తిగా కట్టడి చేశారు. ఒమన్ జట్టులో వసీం అలీ ఒక్కడే 32 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచి కాస్త పోరాటం చేశాడు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలం కావడంతో ఆ జట్టు 16.2 ఓవర్లలోనే 104 పరుగులకు ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా బ్యాటర్లు ఏమాత్రం కనికరం చూపించలేదు. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగారు. ముఖ్యంగా కెప్టెన్ మిచెల్ మార్ష్ ఒమన్ బౌలర్లను ఉతికి ఆరేశాడు. కేవలం 33 బంతుల్లోనే 64 పరుగులు చేసి అజేయంగా (నాటౌట్) నిలిచాడు. అతనికి తోడుగా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ కూడా 32 పరుగులు చేసి జట్టు విజయానికి గట్టి పునాది వేశాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు ఏకంగా 93 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ట్రావిస్ హెడ్‌ను షకీల్ అహ్మద్ (1/29) అవుట్ చేసి ఒమన్‌కు ఈ ఇన్నింగ్స్‌లో ఏకైక వికెట్ అందించాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా కేవలం 9.4 ఓవర్లలోనే 108/1 స్కోరుతో లక్ష్యాన్ని చేరుకుంది.




# ఇకపైనే టీమ్ ఇండియాకు సిసలైన పోటీ



టీ20 ప్రపంచ కప్‌లో అసలైన పోరుకు రంగం సిద్ధమైంది. 20 జట్లతో ప్రారంభమైన టోర్నమెంట్?లో 8 టీమ్స్? మిగిలాయి. ఈ ఎనిమిది జట్ల మధ్య శనివారం నుంచి సూపర్ 8 పోరు షురూ కానుంది. గ్రూప్? దశలో భారత్ ఓటమి లేకుండా నాలుగు మ్యాచ్?ల్లోనూ నెగ్గి తదుపరి దశకు రెడీ అవుతోంది. అయితే ఈ టోర్నీలో భారత్ ఇప్పటిదాకా పాకిస్థాన్ మినహా బలమైన జట్టును ఢీ కొట్టలేదు. కానీ, ఇకపైనే టీమ్ఇండియాకు సిసలైన పోటీ ఉండనుంది. సూపర్ 8లో వెస్టిండీస్, సౌతాఫ్రికా లాంటి పటిష్ఠమైన జట్లను ఢీ కొట్టాల్సి ఉంది. మొత్తం ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించి సూపర్ 8 మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ఇందులో భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే ఒక గ్రూప్?లో ఉండగా, శ్రీలంక, న్యూజిలాండ్, పాకిస్థాన్, ఇంగ్లాండ్ ఇంకో గ్రూపులో ఉన్నాయి. ఇందులో ఒక్కో గ్రూప్?లోని జట్టు మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ (మొత్తం 3 మ్యాచ్?లు) ఆడుతుంది. అలా మ్యాచ్?లు ముగిసేసరికి రెండు గ్రూపుల్లోని టాప్ 2 జట్లు సెమీఫైనల్?కు అర్హత సాధిస్తాయి. అక్కడ నెగ్గిన జట్లు ఫైనల్?కు చేరుకుంటాయి. ఫిబ్రవరి 22 ఆదివారం భారత్ సూపర్ 8లో తొలి మ్యాచ్ ఆడనుంది. ఇందులో సౌతాఫ్రికాను ఎదుర్కోనుంది. ఈ మ్యాచ్?కు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికకానుంది. సాయంత్రం 7 గంటలకు మ్యాచ్? మొదలవుతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 26 గురువారం చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జింబాబ్వేతో భారత్ రెండో మ్యాచ్ ఆడనుంది. దీని తర్వాత మార్చి 1 ఆదివారం వెస్టిండీస్‌తో చివరి మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఈ పోరుకు కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్? ఆతిథ్యం ఇవ్వనుంది.అయితే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా సెమీస్?కు దూసుకెళ్లాలంటే భారత్ మూడు మ్యాచ్?ల్లోనూ నెగ్గాలి.

# ఇషానీ జోహార్‌తో విడాకులు తీసుకున్న రాహుల్ చాహర్

భారత క్రికెటర్ రాహుల్ చాహర్, తన భార్య ఇషానీ జోహార్‌తో విడాకులు తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. సుదీర్ఘ కాలం పాటు కొనసాగిన వీరి వివాహ బంధం ముగియడంపై రాహుల్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్ చేశారు. గత కొద్ది కాలంగా వ్యక్తిగత జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారత స్పిన్నర్ రాహుల్ చాహర్, తన వైవాహిక బంధానికి ముగింపు పలికారు. ఫ్యాషన్ డిజైనర్ అయిన ఇషానీ జోహార్‌తో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. రాహుల్ తన విడాకుల నిర్ణయం గురించి ఓ సందేశాన్ని పంచుకున్నారు. "నేను చాలా చిన్న వయసులోనే పెళ్లి చేసుకున్నాను. అప్పట్లో నన్ను నేను, నా విలువలను, జీవితం వైపు నా దిశను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను" అని రాహుల్ పేర్కొన్నారు. గత 15 నెలలుగా కోర్టు ప్రక్రియల ద్వారా వెళ్తున్న సమయంలో సహనం, నిజాయితీ ప్రాముఖ్యతను తెలుసుకున్నట్లు ఆయన వివరించారు. "నేను ఈ బంధాన్ని కోపంతోనో, విచారంతోనో ముగించడం లేదు. పూర్తి స్పష్టతతో ముందుకు సాగుతున్నాను. కొన్ని సంబంధాలు కేవలం మనకు జీవిత పాఠాలు నేర్పడానికే వస్తాయి" అని రాహుల్ రాసుకొచ్చారు. ఈ విడాకులను ఒక ముగింపుగా కాకుండా కొత్త ప్రారంభంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆత్మగౌరవం, ప్రశాంతత, భవిష్యత్తుపై స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగుతానని, తన మనసులో ఎలాంటి చేదు అనుభవాలను ఉంచుకోవాలని అనుకోవడం లేదని స్పష్టం చేశారు. రాహుల్ – ఇషానీ బంధం

ప్రజావీక్షణం దినపత్రిక

# విష్ణు విన్యాసానికి లైన్ క్లియర్..

శ్రీవిష్ణు నటించిన 'మృత్యుంజయ్', 'విష్ణు విన్యాసం' చిత్రాలు ఒకే రోజు వ్యవధిలో విడుదల కానుండటంతో ట్రేడ్ వర్గాల్లో టెన్షన్ నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే ఈ క్లాష్‌ను నివారించడానికి మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మృత్యుంజయ్ చిత్రాన్ని వాయిదా వేశారు. కొత్త విడుదల తేదీని ప్రకటించారు. మరోవైపు విష్ణు విన్యాసం సినిమాను ఒక రోజు ముందుగా రిలీజ్ చేస్తున్నారు. దీనివల్ల శ్రీవిష్ణు ఒక సినిమా ప్రమోషన్స్ ముగించుకుని, మరో సినిమా ప్రచారానికి సమయం కేటాయించే అవకాశం లభించింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన రెండు సినిమాలు ఒకే సమయంలో, ఒక్క రోజు గ్యాప్ లో విడుదలకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27న మృత్యుంజయ్.. 28న విష్ణు విన్యాసం మూవీని రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అఫిషియల్ గా అనౌన్స్ చేశారు. ఇలా ఒకే హీరోకి చెందిన రెండు చిత్రాలు ఒకేసారి థియేటర్లలోకి రావడం అనేది చాలా అరుదుగా జరుగుతుంది. అందుకే గత కొన్ని రోజులుగా 'శ్రీవిష్ణు జం శ్రీవిష్ణు' అంటూ పెద్ద ఎత్తున చర్చలు జరిగాయి. అయితే ఇలాంటి సంకట పరిస్థితి నుంచి శ్రీవిష్ణు బయటపడ్డారు. గతంలో నందమూరి బాలకృష్ణ నటించిన బంగారు బుల్లోడు, నిప్పురవ్వ సినిమాలు ఒకే రోజు రిలీజ్ అవ్వగా.. వాటిల్లో ఒకటి హిట్టవ్వగా, మరొకటి ఫ్లాప్ అయింది. ఆ తర్వాత నాని నటించిన ఎవడే సుబ్రమణ్యం, జెండాపై కపిరాజు చిత్రాలను ఒకే రోజు విడుదల చేశారు. అందులో ఒకటి మాత్రమే సక్సెస్ సాధించింది. దీంతో మృత్యుంజయ్ ఒ విష్ణు విన్యాసం సినిమాల మధ్య పోటీ ఏర్పడుతుందని తెలియడంతో, రెండింటిలో ఏది ప్రేక్షకాదరణ దక్కించుకుంటుందో అని ట్రేడ్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆ రెండు సినిమాల్లో ఒకటి వాయిదా పడింది.




# ఫంకీ క్లోజింగ్ కలెక్షన్లు...

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు నిర్మించిన చిత్రం ఫంకీ. విశ్వక్‌సేన్, కాయదు లోహర్‌లు జంటగా నటించగా.. జాతిరత్నాలు ఫేమ్ అనుదీప్ కేవీ దర్శకత్వం వహించారు. వీకే నరేష్, వీటీవీ గణేష్, సంపత్ రాజ్, ఈశ్వరి రావు, రఘుబాబు, మురళీధర్ గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ డైరెక్షన్ చేశారు.. నవీన్ నూలి ఎడిటర్‌గా, సురేష్ సారంగం సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించారు. వాలంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 13వ తేదీన ఫంకీ మూవీ వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో ఫంకీ బడ్జెట్ ఎంత? ప్రీ రిలీజ్ బిజినెస్ ఎంత? బ్రేక్‌ఈవెన్ టార్గెట్ ఎంత? విశ్వక్‌సేన్ మూవీకి క్లోజింగ్ కలెక్షన్స్ ఎంత? ఫంకీకి లాభమెంత? నష్టమెంత? అనేది పరిశీలిస్తే...నటీనటులు, సాంకేతిక నిపుణుల రెమ్యునరేషన్, ప్రొడక్షన్ కాస్ట్, ప్రమోషనల్ ఖర్చులు కలిపి ఫంకీ సినిమాకు దాదాపు 25 కోట్ల రూపాయల బట్జెట్ అయ్యింది. ఇక ఈ మూవీ ప్రీ రిలీజ్ బిజినెస్ విషయాన్ని పరిశీలిస్తే.. నైజాం థియేట్రికల్ రైట్స్ 4 కోట్ల రూపాయలు, సీడెడ్ థియేట్రికల్ రైట్స్ 1.25 కోట్ల రూపాయలు, ఆంధ్రా థియేట్రికల్ రైట్స్ 5 కోట్ల రూపాయలు చొప్పున తెలుగు రాష్ట్రాల్లో 10.25 కోట్ల రూపాయల బిజినెస్ చేసింది ఫంకీ. కర్ణాటక ం రెస్టాఫ్ ఇండియా థియేట్రికల్ రైట్స్ 75 లక్షల రూపాయలు, ఓవర్సీస్ థియేట్రికల్ రైట్స్‌ను మోక్షా మూవీస్ 2 కోట్ల రూపాయలకు దక్కించుకుంది. దాంతో వరల్డ్ వైడ్‌గా ఫంకీ మూవీ ప్రీ రిలీజ్ బిజినెస్ 13 కోట్ల రూపాయల మేర చేసింది. విశ్వక్‌సేన్ మూవీ లాభాల్లోకి రావాలంటే బాక్సాఫీస్ వద్ద 14 కోట్ల రూపాయల షేర్, 28 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టాల్సి ఉందని ట్రేడ్ పండితులు వాల్యూ నిర్దేశించారు.



## కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది

'ధమాకా' తర్వాత హీరోయిన్ గా శ్రీలీల ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. బాలకృష్ణ-అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన 'భగవంత్ కేసరి' హిట్ అయినా.. అందులో శ్రీలీల హీరోయిన్ కాదు. అయినప్పటికీ దాని సక్సెస్ క్రెడిట్ శ్రీలీల ఖాతాలో పడలేదు.'స్కంద' 'ఆదికేశవ' 'ఎక్స్ట్రా ఆర్డియనరీ మెన్' 'గుంటూరు కారం' 'రాబిన్ హుడ్' 'జూనియర్' 'మాస్ జాతర' 'పరాశక్తి' ఇలా అన్నీ డిజాస్టర్లే. వేరే హీరోయిన్ ట్రాక్ రికార్డు ఇలా ఉంటే.. ఈపాటికి దుకాణం సర్దేసేది. కానీ శ్రీలీల ఆ విషయంలో లక్కీ అనే చెప్పాలి. ఇన్ని డిజాస్టర్లు పడినప్పటికీ.. ఆమె డిమాండ్ ఏమీ తగ్గలేదు. ఇప్పటికీ ఆమె కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది. ప్రస్తుతం ఆమె హిందీలో 2 సినిమాల్లో నటిస్తుంది.అవి రెండూ క్రేజీ ప్రాజెక్టులే.






## భార్యపై ప్రేమను చాటుకున్న నిక్

భార్య, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా సంస్కృతిని గౌరవిస్తూ ఆయన చేసిన ఈ పని ఇప్పుడు నెటిజన్ల మనసు గెలుచుకుంటోంది. పురుషులు కూడా ఇలా చేయవచ్చా? అని అందరూ ఆశ్చర్యపోయేలా చేసిన ఆ విశేషాలేంటో చూద్దాం.. ఆయన ఒక గ్లోబల్ మ్యూజిక్ ఐకాన్. ఆమె ప్రపంచం మెచ్చిన భారతీయ నటి. వీరిద్దరి జోడీ అంటేనే ఒక సెలబ్రేషన్. తాజాగా ఆ పాప్ సింగర్ తన భార్య నటిస్తున్న 'ద బ్లఫ్' సినిమాలోని 'బ్లడీ మేరీ' పాత్రకు గుర్తుగా ఒక కాక్టెయిల్ తయారు చేస్తున్న వీడియోను షేర్ చేశారు. అయితే, అందరి దృష్టి ఆ కాక్టెయిల్ మీద కంటే ఆయన మణికట్టుపై ఉన్న ఒక నల్లపూసల గొలుసు మీదకు వెళ్లింది. హిందూ సంప్రదాయంలో కేవలం మహిళలు మాత్రమే ధరించే మంగళసూత్రాన్ని ఆయన బ్రాస్‌లెట్ రూపంలో ధరించడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ పాప్ స్టార్ మరెవరో కాదు.. నిక్ జోనస్. సాధారణంగా మంగళసూత్రం అంటే వివాహితలకు చిహ్నం. నల్లపూసలు, బంగారు సూత్రాలతో ఉండే ఈ పవిత్ర బంధం ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో సోనమ్ కపూర్ తన రాశి చక్రంతో కూడిన మంగళసూత్రాన్ని ఎంచుకోగా, ఆలియా భట్ తన హారంలో ఇన్ఫినిటీ గుర్తును చేర్చుకుంది. రాధికా మర్చంట్ సైతం తన మంగళసూత్రాన్ని బ్రాస్‌లెట్‌గా ధరించి ఆశ్చర్యపరిచింది. అయితే, ఇప్పుడు నిక్ జోనస్ దానిని ధరించడం ద్వారా ఒక సరికొత్త చర్చకు తెరలేపారు. పెళ్లయిన వస్తువులను, గుర్తులను కేవలం మహిళలు మాత్రమే ధరించాలా? అనే చర్చ ఎప్పటి నుంచో ఉంది.



## రూమర్లపై కౌంటర్ ఇచ్చిన మీనా

తనపై వస్తున్న అనవసర రూమర్లకు ఈసారి గట్టిగానే కౌంటర్ ఇచ్చారు సీనియర్ హీరోయిన్ మీనా. చాలా కాలం పాటు దక్షిణ భారత సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగొందిన మీనా, తాజాగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుడు కథనాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే మీనా, ఈసారి మాత్రం తన సహనాన్ని పరీక్షిస్తున్నారని స్పష్టంగా చెప్పుకొచ్చారు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి, ఆపై హీరోయిన్‌గా స్టార్ స్టేటస్ అందుకున్న మీనా. సీతారామయ్య గారి మనవరాలు, చంటి, అబ్బాయిగారు, అల్లరి అల్లుడు, ముత్తు వంటి చిత్రాలతో ప్రేక్షకుల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించారు. ఇప్పటికీ క్యారెక్టర్ రోల్స్, కీలక పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు.



## పవర్ ఫుల్ లాయర్‌గా తాప్సీ పన్ను

ఒకప్పుడు తన అందాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు ఉత్తరాది భామ తాప్సీ పన్ను. కానీ అందరు హీరోయిన్ల మాదిరిగానే ఆమెకు బాలీవుడ్‌పై మోజు పుట్టి అక్కడే సెటిలైపోయింది. ఒకటి రెండు హిట్లు తప్పించి హిందీ చిత్ర పరిశ్రమలో తాప్సీ కెరీర్‌లో పెద్దగా మెరుపులు లేవు. కానీ ఏదో కిందా మీదా పడుతూ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు తాప్సీ. దోబారా, తడ్కా, బ్లర్, ధక్ ధక్, డూంకీ, ఖేల్ ఖేల్ మై తదితర సినిమాలలో ఆమె నటించారు. తాజాగా తాప్సీ పన్ను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం అస్సీ.

మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాల బ్యాక్‌డ్రాప్‌లో యదార్థ ఘటనల తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ మూవీ అస్సీ. కోర్ట్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో తాప్సీ పన్ను పవర్‌ఫుల్ లాయర్‌గా నటించారు. ఫిబ్రవరి 20వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. టీ సిరీస్ ఫిల్మ్స్, బెనారస్ మీడియా వర్క్స్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కృషన్ కుమార్, అనుభవ్ సిన్హాలు సంయుక్తంగా అస్సీ మూవీని నిర్మించగా.. అనుభవ్ సిన్హా దర్శకత్వం వహించారు. తాప్సీతో పాటు కని కుస్రుతి, రేవతి, మనోజ్ పహ్వా, కుముద్ మిశ్రా, మహమ్మద్ జీషన్ ఆయూబ్, సత్యజిత్ శర్మ, విపుల్ గుప్తా తదితరులు కీలకపాత్రలు పోషించారు. సీతా పహ్వా, సుప్రీయ పాఠక్, నసీరుద్దీన్ షాలు గెస్ట్ రోల్‌లో అలరించారు. ఈవారం ముల్లిగన్ ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా.. అమర్జిత్ సింగ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. రంజిత్ బరత్ సంగీత దర్శకత్వం వహించారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషం, ప్రొడక్షన్ కాస్ట్, ప్రమోషనల్ కార్యక్రమాలతో కలిపి అస్సీ మూవీకి 40 కోట్ల రూపాయల బడ్జెట్ అయ్యింది. టీజర్, ట్రైలర్ తదితర ప్రమోషనల్ కార్యక్రమాలతో అస్సీ మూవీకి ఓ మాదిరిగా థియేట్రికల్, నాన్ థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా లాభాల్లోకి రావాలంటే బాక్సాఫీస్ వద్ద 80 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టాల్సి ఉందని ట్రేడ్ పండితులు వాల్యూ నిర్దేశించారు.

# స్టార్ హీరోహీరోయిన్లకు మించిన క్రేజ్

ప్రస్తుతం తెలుగు బుల్లితెరపై దూసుకుపోతున్న సీరియల్ గుండె నిండా గుడిగంటలు. అత్యధిక టీఆర్పీ రేటింగ్ తో ఈ సీరియల్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సాధారణ మధ్య తరగతి కుటుంబ కథతో సాగుతున్న ఈ సీరియల్ ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది. అందుకే ఈ సీరియల్ కు రోజు రోజుకీ విపరీతమైన రెస్పాన్స్ వస్తుంది. ఇక ఇందులో ప్రధాన పాత్రలు బాలు, మీనా జోడికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మీనా గురించి చెప్పుకుంటే.. అందంతోపాటు పద్ధతిగా చీరకట్టులో కనిపిస్తూ అద్భుతమైన నటనతో కట్టిపడేస్తుంది. మీనా అసలు పేరు అమూల్య గౌడ. కన్నడ సినీరంగానికి చెందిన ఈ ముద్దుగుమ్మకు తెలుగులో ఫాలోయింగ్ ఎక్కువే. సీరియల్లో పద్ధతిగా కనిపించే అమూల్య.. సోషల్ మీడియాలో మాత్రం గ్లామరస్ ఫోటోలతో రచ్చ చేస్తుంది. నెట్టింట ఈ అమ్మడు చేసే అరాచకం గురించి చెప్పక్కర్లేదు. మైసూర్ కు చెందిన అమూల్య గౌడ.. దాదాపు పదేళ్ల క్రితం సినీప్రయాణం స్టార్ట్ చేసింది. కన్నడ సీరియల్ స్వాతి ముత్తుతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత కోమలి సీరియల్ ద్వారా ఫేమ్ సంపాదించుకుంది. కన్నడలో పలు సీరియల్స్ చేసిన ఈ అమ్మడు.. కార్తీక దీపం సీరియల్లో శౌర్య పాత్రతో తెలుగు అడియన్స్ ముందుకు వచ్చింది. ఇందులో రౌడీ బేబీగా మరింత పాపులర్ అయ్యింది.ఆ తర్వాత గుండె నిండా గుడిగంటలు సీరియల్లో మీనా పాత్రతో మరింత పాపులర్ అయ్యింది.



Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com